## మావి పండగ చీరలు...రేవంత్ వన్నీ ఓట్ల చీరలు




# PCW
# తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## నిండు గర్భిణీ ప్రత్యూష మృతికి కారకులెవరు...




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 335 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 28 నవంబర్ 2025



## యువత వల్లే
# స్టార్టప్ విప్లవం

● ప్రపంచానికే ఆదర్శం మన యువత ● దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌ల ఏర్పాటు ● మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్ ● ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు

**న్యూఢిల్లీ, 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మ విశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-I'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా
# డాక్యుమెంట్

- భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా ఉండాలి
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో కనిపించాలి
- ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించాలి
- సమ్మిట్‌కు ప్రధాని మోదీని ఆహ్వానిస్తున్నాం
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై సీఎం
- రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై సమీక్ష



**హైదరాబాద్,నవంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):**పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై సీఎం రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై ఈ భేటీలో చర్చించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను మిగతా2లో...

# 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

- సింగిల్ బెంచ్
- ఉత్తర్వులు కొట్టివేత
- ఉత్తర్వులను సస్పెండ్ చేసిన సీజే ధర్మాసనం
- తదుపరి విచారణను
- 6 వారాలకు వాయిదా




## రాజకీయాల్లో
# గెలుపోటములు సహజం

- మళ్లీ గెలుస్తాం...కెసిఆర్‌ను సిఎంను చేస్తాం
- అసలు యుద్ధం 2028లో ఉంటుంది
- తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,నవంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజకీ యాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ గెలుస్తాం..అధికారంలోకి వస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఎపిలో కల్వకుర్తిలో ఎన్టీఆర్ కూడా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. అసలు యుద్ధం 2028లో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల సమక్షంలో బయట పెడుదామని పిలుపు నిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ మిగతా2లో...



## ఎస్సీ,ఎస్టీలకు మాదిరి
# దివ్యాంగులకు రక్షణ

- కఠిన చట్టాలు అవసరమన్న సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,27 (పిసిడబ్ల్యూ న్యూస్):** దివ్యాంగులకు కూడా రక్షణ కవచం ఉండాలని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. వారినికించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీం కోర్టుపేర్కొంది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రా నికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ మిగతా2లో...

## సిగాచీ ఫార్మా పేలుడు
# ఘటన చిన్నదా?




- 54 మంది చనిపోయిన ఘటన చిన్నదేమీ కాదు - పోలీసులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం
- నిందితులను గుర్తించకపోవడంపై తీవ్ర అసంతృప్తి - డిసెంబర్ 9కి వాయిదా వేసిన ధర్మాసనం

## ప్రశాంతంగా పంచాయితీ
# ఎన్నికల నిర్వహణ

- పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం
- పోలీస్ అధికారులతో డిజిపి వీడియో కాన్ఫరెన్స్




## పార్లమెంట్ సమావేశాలపై
# టిడిపి వ్యూహం

పార్టీ ముఖ్యులతో సిఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్ శీతా కాల సమావేశాలు మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావే శమైంది. గురువారం రాజధాని అమరావతిలోని ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ముఖ్యనేతలతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కేంద్రం నుంచి మిగతా2లో...




## మొదలైన పంచాయతీ
# ఎన్నికల సందడి..

నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్లు షురూ!

మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలు

**హైదరాబాద్, నవంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం నుంచి ఈ నెల 29 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామపత్రాలను దాఖలు మిగతా2లో...

## కుంభకోణానికి
# ఆస్కారమే లేదు

- ఇండస్ట్రీయల్ పాలసీపై దుష్ప్రచారం
- పొల్యూషన్ ఫ్రీగా చేయడమే లక్ష్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇండస్ట్రీయల్ పాలసీ పై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని పొల్యూషన్ ఫ్రీగా చేయడమే తమ ప్రభుత్వ పాలసీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే మిగతా2లో...

# బతుకమ్మకుంట వ్యవహారం

హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

డిసెంబర్ 5లోపు కోర్టు ఎదుట హాజరుకు ఆదేశం



**హైదరాబాద్, 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగ నాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. మిగతా2లో...

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

(మొదటి పేజీ తరువాయి)

సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బానిసత్వం లేని ఒకే ఒక్క పార్టీ గులాబీ పార్టీ అని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ సాగునీరు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి 660 మీటర్ల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టారని అన్నారు. గొలుసుకట్టు రిజర్వాయర్లను 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. ఒక పంపును కూడా కేసీఆర్ ప్రారంభించారని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కరెంట్ కష్టాలతో ఎంతమంది చనిపోయారో మీకంతా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. వైఎస్ హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చినా.. ఆరు గంటలే ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దొంగలు కొట్టే సమయంలో కరెంటు ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు రాలేదని రేవంత్ రెడ్డే చెప్పాడని అన్నారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ, సాగునీరు తెచ్చుకున్నామని తెలిపారు. రైతుకు పెట్టుబడి రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. మన పార్టీ నాయకుల అనైక్యతతోనే ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. మనం చేసిన పనులు సరిగ్గా చెప్పుకోలేదని తెలిపారు. సోషల్‌మీడియాలో చెప్పిన అబద్దాలను ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్ల ఖర్చు అయ్యిందని.. కానీ రాహుల్ గాంధీ వచ్చి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే ప్రజలు నమ్మారని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల గారడిలో పడి మోసపోయారని తెలిపారు. కల్వకుర్తిలో ఆస్పత్రి లేదని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతున్నాడని.. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బాధ్యుడా అని నిలదీశారు. 420 హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు ఏం చేశావని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తే ఫ్రీ బస్సు అంటున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ అంటూ పురుషులకు డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టేసరికి కేసీఆర్ గుర్తుకొచ్చిండు అని కేటీఆర్ అన్నారు. ఏ ఊళ్లో అయినా పది మంది గుమిగూడితే.. తొందరగా కేసీఆర్‌ను తెచ్చుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

# 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

**హైదరాబాద్, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సీజే ధర్మాసనం జారీ చేసింది. 2015 గ్రూప్-2 నియామకాలు రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పును ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పును పిటిషనర్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది.గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సీజే ధర్మాసనం తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. 2019 అక్టోబర్ 24న చేపట్టిన గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ బీమపాక ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్ 2 జవాబు పత్రాల్లో వైట్ నర్ వినియోగం, డబుల్ బబ్లింగ్ చేసిన పార్ట్ బీ పత్రాలను మూల్యాంకనం చేయడం చెల్లదని సింగిల్ బెంచ్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ట్యాంపరింగ్ జరిగినట్లు స్పష్టంగా కనిపించినప్పటికీ వాటిని పక్కన పెట్టకుండా మూల్యాంకనం చేయడం చెల్లదని స్పష్టం చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా చేసిన మూల్యాంకనం ఆధారంగా చేపట్టిన నియామకాలు చెల్లవని రద్దు చేస్తూ మరోసారి మూల్యాంకనం చేసి అర్హుల జాబితాను విడుదల చేయాలని జస్టిస్ నగేశ్ బీమపాక ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతా 8 వారాల్లో ముగియాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ అప్పీలు దాఖలు చేశారు.కాగా ఈ అప్పీలు సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులు సరిగ్గా లేవని దీనివల్ల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు నష్టపోవాల్సి వస్తుందని వాదించారు. డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని అన్నీ పరిగణలోకి తీసుకొని టీజీపీఎస్సీ నియామక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2019లో ఎంపికైన అభ్యర్థులు ఇప్పుడు వివిధ హోదాల్లో ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని సింగిల్ బెంచ్ ఉత్తర్వుల వల్ల వాళ్లందరికీ నష్టం జరుగుతుందన్నారు. అప్పీలుపై వాదనలు విన్న సీజే ధర్మాసనం సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ జారీ చేశారు. 2016లో మరికొన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్ ఇచ్చారు. వివిధ కేటగిరీల కింద మొత్తం 1,032 పోస్టులకు 2016 నవంబరులో పరీక్షలు నిర్వహించారు. కొంత మంది అభ్యర్థులు వైట్‌నర్ ఉపయోగించారని మరికొంత డబుల్ బబ్లింగ్ చేశారని 2017లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. సాంకేతిక కమిటీ హైకోర్టుకు కొన్ని సూచనలు సమర్పించింది. దాని ప్రకారం ఓఎంఆర్ షీట్ లోని పార్ట్ ఏ లో వ్యక్తిగత వివరాలు, బుక్ లెట్ నెంబరుకు సంబంధించి చెరిపివేతలున్నా సమస్య కాదని తెలిపింది.పార్ట్ బీలో 150 ప్రశ్నల విషయంలో వైట్‌నర్ వాడినట్లు గుర్తిస్తే ఆ జవాబులను పరిగణలోకి తీసుకోవద్దని సాంకేతిక కమిటీ సూచించింది. దీని ఆధారంగా మూల్యాంకనం చేసి 2019 అక్టోబరులో అర్హుల జాబితా ప్రకటించి నియామక పత్రాలిచ్చారు. ట్యాంపరింగ్ జరిగినా మూల్యాంకనం చేసి అర్హులను ఎంపిక చేశారంటూ మళ్లీ 6 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై సుదీర్ఘ విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ బీమపాక నియామకాలు రద్దు చేస్తూ ఈనెల 17వ తేదీన తీర్పు వెలువరించారు.

# సిగాచీ ఫార్మా పేలుడు ఘటన చిన్నదా?

**హైదరాబాద్,నవంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):**

సిగాచీ ఫార్మా పరిశ్రమలో 54 మంది కార్మికుల ప్రాణాలను బలిగొన్న పేలుడు ఘటనలో పోలీసు దర్యాప్తు తీరును తెలంగాణ హైకోర్టు తీవ్రంగా తప్పు పట్టింది. ఇంత పెద్ద దుర్ఘటన జరిగి నెలలు గడుస్తున్నా దర్యాప్తు పూర్తి కాకపోవడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది సాధారణ ప్రమాదం కాదని, ఇంతటి ఘోరంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని చెప్పడం దారుణమని వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. "ఇప్పటికే 237 మంది సాక్షులను విచారించినా పురోగతి ఏది? పేలుడుకు బాధ్యులైన వారిని ఇప్పటివరకు ఎందుకు గుర్తించలేదు?" అని నిలదీసింది. ఇంతటి తీవ్రమైన ఘటనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయకపోగా, కేవలం డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిపై పూర్తిస్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో పారదర్శకత లోపించరాదని, వేగంగా పూర్తి చేసి బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని సూచించింది. అనంతరం, తదుపరి విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేసింది.

# ప్రశాంతంగా పంచాయితీ ఎన్నికల నిర్వహణ



**హైదరాబాద్, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిస్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని,ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్, మల్టి జోన్- 1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వయిజర్ ఇ రాములు, పాల్గొన్నారు.

# కుంభకోణానికి ఆస్కారమే లేదు

(మొదటి పేజీ తరువాయి)

లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తెచ్చింది పారదర్శకమైన పాలసీ అని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు . బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తాము తెచ్చిన ఇండస్ట్రీయల్ పాలసీ అర్థం కాలేదని తెలిపారు. ప్రతిపక్షాల నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రీయల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రీయల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్ విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది..? అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

# మావి పండగ చీరలు...రేవంత్ వన్నీ ఓట్ల చీరలు: మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శలు

**సిద్దిపేట, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పేరుతో బీసీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీమంత్రి హరీశ్‌రావు మరోమారు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి.. కేవలం 17 శాతమే ఇచ్చారన్నారు. కేసీఆర్.. పండుగ కోసం చీరలిస్తే రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్ల కోసమే చీరలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రికి ఎంతసేపూ ఓట్ల రాజకీయమే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాల మీద శ్రద్ధ లేదన్నారు. సిద్దిపేటలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో గురువారం దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. నవంబరు 29.. చరిత్రను మలుపుతిప్పిన రోజన్నారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. రాష్ట్ర సాధనకు ఉద్యమగడ్డ అయిన సిద్దిపేటలో 1,531 రోజుల పాటు దీక్షలు కొనసాగటం చరిత్ర అన్నారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 9 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు.

# యువత వల్లే స్టార్టప్ విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# ఎస్సీ,ఎస్టీలకు మాదిరి దివ్యాంగులకు రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని సమయ్ రైనాకు సుప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణతతో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు.రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు నేడు విచారించింది. బాధితుల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. వీటితో సీజేఐ జస్టిస్ సుర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. దివ్యాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే.. ఎస్సీ/ఎస్టీ చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీం ధర్మాసనం అడిగింది. దివ్యాంగులకు రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చే విషయంపై ఆలోచించాలని సూచించింది. వారికి కావాల్సింది గౌరవ, మర్యాదలని.. వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్‌లకు సూచించింది. ఈ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది.

# పార్లమెంట్ సమావేశాలపై టిడిపి వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

రావాల్సిన ప్రయోజనాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. దీంతో ఏపీలో అభివృద్ధికి కేంద్రం తన వంతు సహాయ సహకారాలు అందిస్తుంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఇవి డిసెంబర్ 19వ తేదీతో ముగుస్తాయి. 2014లో ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ తొలిసారి బాధ్యతలు చేపట్టారు. ఆయన అధికారం చేపట్టిన తర్వాత జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో ఇది అత్యంత తక్కువ కాలం. అంటే కేవలం 19 రోజులు మాత్రమే ఈ సమావేశాలు జరగనున్నాయి.

# రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా డాక్యుమెంట్

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు.కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు చేసుకునే సమయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమ్మిట్‌లో సంక్షేమం, వైద్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు తదితర విభాగాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్లీనరీలో విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి ఈవెంట్ బాధ్యతను ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అన్నారు. నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన డిజైన్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. 2,600 మందిని సమ్మిట్‌కు ఆహ్వానించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రికి తెలియజేశారు.

# బతుకమ్మకుంట వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘిం చారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకో వద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే ఇప్పటికే ఇక్కడ సుందరీకరణ పనులు సాగాయి. పూర్వవైభవం తీసుకుని వచ్చారు. సిఎం రేవంత్ తదితరులు కలిసి ప్రారంభించారు.

# మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి..

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 30న నామినేషన్లను పరిశీలిస్తారు. అదే రోజు సాయంత్రం బరిలో నిలిచిన అభ్యర్థు లతో కూడిన తుది జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 3 వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.తొలిదశలో 4,236 గ్రామాలకు ఎన్నికలు జరగనుండగా.. 37,450 వార్డుల్లో పోలింగ్ డిసెంబర్ 3న పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు. డిసెంబర్ 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి వార్డు సభ్యులు, సర్పంచ్ ఫలితాలను వెల్లడించనున్నారు. అదే సమయంలో తొలి విడతలో ఎన్నికలు జరిగే 189 మండలాల్లోని 4,236 గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో గ్రామాల్లో సందడి నెలకొన్నది.

# నిండు గర్భిణీ ప్రత్యూష మృతికి కారకులెవరు...

## విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం...

## విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మృతదేహంతో నర్సంపేటలో రాస్తారోకో..



**వరంగల్/నర్సంపేట బ్యూరో చీఫ్, నవంబర్27(పీసీడబ్ల్యూ న్యూస్):**

కుటుంబంతో, భర్త పిల్లలతో ఆనందంగా ఉండవలసిన ఆ ఇల్లాలును విధి అర్ధంతరంగా కాటేసింది, పిల్లలను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన ఆ తల్లిని కాలం కనికరం లేకుండా తీసుకెళ్లి పోయింది. కడుపులో ఉన్న బిడ్డతో సంతోషంగా గడపాల్సిన సందర్భంలో గర్భంలో ఉన్న శిశువు తల్లి కడుపుపై ఎనిమిది నెలల శిశువు,గర్భంలో కేరింతలతో అటు ఇటు తిరుగుతూ, తల్లికి ఆనందాన్నిస్తూ ఆ శిశువు ఎప్పుడెపుడా అని ఈ ప్రపంచాన్ని చూడగలుగుతుందా అని ఆ తల్లి సంతోషంగా ఉన్న వేళ విధి ఒక్కసారిగా ఎనిమిది నెలల నిండు గర్భిణీ పై, పగబట్టి పైకి తీసుకెళ్ళింది మరీ నిర్లక్ష్యానికి కారకులు ఎవరు.విద్యుత్ శాఖ అధికారుల..? లేక తన తప్పిదమా ఏదేమైనా రెండు సంవత్సరాల కుమారుడిని భర్తను, కుటుంబాన్ని వదిలి విద్యుత్ షాక్ తో మరణించిన ప్రత్యూష కు కన్నీటి నివాళులు అంటూ ప్రతి ఒక్కరూ కన్నీరు కారుస్తున్నారు. **పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో నిండు గర్భిణి దామెర ప్రత్యూష విద్యుత్ షాక్ తో మంగళవారం రోజున మృతి చెందిన విషయం వరంగల్ జిల్లా ప్రజలందరినీ తీవ్ర మనోవేదనకు గురి చేసింది. పూర్తి వివరాల్లోకి వెళితే దార ప్రత్యూష అనే గృహిణి నర్సంపేట నగరంలో గల తన ఇంటిలో భర్త మరియు కుమారుడితో సంతోషంగా ఉంటుంది. గత మంగళవారం మేడ పైన గల దండంపై ఉతికిన బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు మెడపై దగ్గర ఉండటంతో విద్యుత్ తీగలు తగిలి ఒకసారి గా విద్యుత్ షాక్ తో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన నర్సంపేటలో గల ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.కుటుంబంతో సంతోషంగా ఆడుతూ పాడుతూ గడపాల్సిన ప్రత్యూష మృతితో ఆ కుటుంబం వీధిన పడింది. రెండు సంవత్సరాల కుమారుడు దిక్కులేనివాడు అయ్యాడు. కన్నతల్లి ప్రేమకు దూరమై బిక్కుబిక్కుమంటూ ఎదురు



చూస్తూ, వచ్చే పోయే వారిని అమ్మ ఏదంటూ అడుగుతూ గుక్క పట్టి ఏడుస్తున్నాడు. **విద్యుత్ తీగలు క్రిందకు వేలాడుతున్నాయని స్థానికులు చెప్పిన పట్టించుకోని అధికారులు...** నర్సంపేటలో కొన్ని ఏరియాలలో విద్యుత్ స్తంభాలు కిందికి ఒరిగిపోయి, వైర్లు కిందకు వేలాడుతూ గతంలో కొంతమందికి విద్యుత్ షాక్ తగిలిన సందర్భాలు అనేకంగా ఉన్నాయి. గతంలో స్థానికులు విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న కూడా వారు ప్రజల బాధలు ఏనాడు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. **ప్రత్యూష మృతదేహంతో రాస్తారోక నిర్వహించిన కుటుంబ సభ్యులు...** నిండు గర్భిణి ప్రత్యూష విద్యుత్ షాక్ తో మృతి చెందిందని తెలుసుకున్న కుటుంబ సభ్య లు బుధవారం రోజున నర్సంపేట లో గల ప్రధాన కూడలిలో చౌరస్తాలో ప్రత్యూష మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష తండ్రి ఈసంపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యుత్ తీగలతో ప్రాణభయం ఉన్నదని విద్యుత్ శాఖ అధికారులకు చాలాసార్లు విన్నవించుకోవడం జరిగిందని అయినా కూడా విద్యుత్ శాఖ అధికారులు ఏనాడు అటువైపుగా రాలేదని, ఒక నిండు గర్భిణీ మృతికి విద్యుత్ శాఖ అధికారులు కారణమయ్యారని, ఇలాంటి దుస్థితి,ఏ ఆడపిల్లకు, ఏ ఒక్కరికి రాకూడదని, ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి



వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆయన వేడుకున్నాడు. **అందుబాటులోకి రాని విద్యుత్ శాఖ ఏఈ.** ప్రజల సమస్యలు పట్టించుకోని శాఖ అధికారులు, ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్న కూడా అంటి ముట్టనట్టుగా రావడం లేదని స్థానికులు అంటున్నారు. స్థానిక డివిజన్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏ.ఈ) ఇప్పటివరకు కూడా సమాచార నిమిత్తము మీడియా పర్సన్స్ ఏ.ఈ కి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుందామని ప్రయత్నం చేయగా ఏ.ఈ ఫోన్ నంబర్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడం పలు అనుమానాలకు తావిస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో అక్కడికి నేరుగా వెళ్లి స్థానికుల సమస్యలను తీర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు. **ప్రత్యూష కుటుంబానికి ఎక్స్గ్రేషియా ప్రకటించాలని అధికారులకు స్థానికుల వేడుకోలు..** విద్యుత్ షాక్ తో అభ్యంతరంగా తనువు చాలించిన నిండు గర్భిణి ప్రత్యూష కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, ప్రత్యూష కుమారుడికి ప్రభుత్వం అండగా ఉండాలని, ఆ చిన్నారికి ఏ లోటు రాకుండా ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలుగా ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని అధికారులను వేడుకున్నారు.

# నిబద్ధతగల కమ్యూనిస్టు పోటు ప్రసాద్




**• ఆశయాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు**

**• వర్ధంతి సభలో బాగం**

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నిబద్ధతగల కమ్యూనిస్టు పోటు ప్రసాద్ అని తుది శ్వాసవరకు పార్టీ విస్తరణకోసం, పేదల అభ్యున్నతి కోసం కృషిచేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతిసభ గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఎస్కె జానిమియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హేమంతరావు మాట్లాడుతూ.. సాయుధ పోరాట వారోత్స కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ తుదిశ్వాస వరకు అదే పంథాను కొనసాగించారన్నారు. విద్యార్థి దశలో విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యంగా ఖమ్మంలో పిజి కళాశాల సాధనకోసం జరిగిన విద్యార్థి ఉద్యమంలో పోటు ప్రసాద్ క్రియాశీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. కార్మిక సంఘ నాయకునిగా పనిచేసిన పోటు ప్రసాద్ సంఘటిత, అసంఘటిత రంగాలలో బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించారన్నారు. సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిన ప్రసాద్ ఎటువంటి విమర్శకు తావివ్వలేదని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా జిల్లాలో పార్టీ శాఖల పునర్ నిర్మాణంపై దృష్టిసారించి సఫలీకృతడయ్యారన్నారు. నాయనమ్మ యర్రమ్మ, తండ్రి రాఘవయ్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పోటు ప్రసాద్ స్పష్టమైన రాజకీయ



సైద్ధాంతిక అవగాహన కలిగి ఉండడంతో పాటు సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకు పోవడంలోనూ ఆయన సఫలీకృతుడయ్యారని హేమంతరావు తెలిపారు. ఒక సంక్లిష్ట పరిస్థితుల్లో పోటు ప్రసాద్ వర్ధంతి సభను జరుపుకుంటున్నామని ఒక పక్క కమ్యూనిస్టు పార్టీ శత వసంత సంబురాలు ఖమ్మంలో జరగబోతున్నాయని ఈ సమయంలో పోటు ప్రసాద్ లేనిలోటు అడుగడుగునా కనిపిస్తుందన్నారు. జాతీయ మహాసభలను ఖమ్మంలో నిర్వహించాలని తలపెట్టిన ఆలోచనాపరుడు ప్రసాద్ అని ఆయన వర్ధంతి సందర్భంగా ప్రసాద్ ఆలోచనలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకు పోవడమే మనం ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు. అభ్యుదయవాదిగా, నికార్సయిన కమ్యూనిస్టుగా జీవించిన ప్రసాద్ కమ్యూనిస్టు ఉద్యమం ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని హేమంతరావు తెలిపారు. అంతకు ముందు పోటు ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వర్ధంతి సభలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్, సతీమణి నిర్మల, సోదరి పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు. **40వ**



**డివిజన్లో...** సిపిఐ నాయకుడు పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభను 40వ డివిజన్లో ఘనంగా నిర్వహించారు. ఆయన స్మారక స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. స్తూపానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బిజి క్లైమెంట్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ.. 40వ డివిజన్లో పార్టీశాఖ ఏర్పాటుకు పోటు ప్రసాద్ విశేష కృషి చేశారని ఆయన సమక్షంలో అనేక మంది సిపిఐలో చేరిన కొద్ది రోజులకే ప్రసాద్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. అట్టడుగు వర్గాలకు దన్నుగా నిలిచే ప్రసాద్ మృతి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, పోటు కళావతి, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ, పోటు పూర్ణ, వరదా నర్సింహారావు, పోటు నిర్మల, పలువురు సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **ఇందిరా నగర్ పైలాన్ వద్ద :** ఇందిరా నగర్ పైలాన్ వద్ద పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్ పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సిపిఐ నాయకులు ప్రారంభించారు. వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని పోటు ప్రసాద్కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, నాయకులు ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, పోటు నిర్మల. తాటి వెంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, వరదా నర్సింహారావు, బండారుపల్లి నవీన్, సత్యనారాయణరెడ్డి, వెంకన్న, నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, ఆముదాల వెంకన్న, జాకీర్, తాటి నిర్మల, అక్రమ్ పాల్గొన్నారు..

# గుడి, బడి పక్కనే లిక్కర్ దందా...

**అధికారులపై ఖమ్మం వాసుల మండిపాటు**

**పవిత్రమైన జమ్మిబండ వద్ద మద్యం షాపా?**

**భక్తుల మనోభావాలతో చెలగాటమా?**

**జమ్మిబండ వద్ద వైన్ షాపును తక్షణమే రద్దు చేయాలి**

**పోలీసుల తీరుపై బీజేపీ ఫైర్.. లిక్కర్ మాఫియాకు ఏజెంట్లుగా మారారంటూ ధ్వజం.**

**రెండు రోజుల్లో తేల్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని అధికారులకు బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాస్తదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు హెచ్చరించారు**









**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగరంలో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి పారువేట స్థలం (జమ్మిబండ) వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై తీవ్ర దుమారం రేగింది. దసరా, శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరిగే ఈ పవిత్ర స్థలానికి ఆనుకుని, పాఠశాలలు, ఆసుపత్రుల మధ్యలో వైన్ షాప్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతుండటంతో స్థానికులు, బీజేపీ నాయకులు భగ్గుమన్నారు. గురువారం నాడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, నేతృత్వంలో ప్రజలు పెద్ద ఎత్తున జమ్మిబండ ప్రదేశానికి తరలివచ్చారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఖమ్మం నగరంలోని అత్యంత పవిత్రమైన జమ్మిబండ ప్రాంతం గురువారం నాడు ఉద్రిక్తతకు దారితీసింది. ప్రతి ఏటా దసరా ఉత్సవాలు, బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగే ఈ ఆధ్యాత్మిక ప్రదేశంలో, సరిగ్గా గుడి స్థలానికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతుండటంపై స్థానికులు, బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, మహిళలు, స్థానికులు పెద్ద ఎత్తున జమ్మిబండ వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. సంఘటనా స్థలంలో ఏర్పాటు చేస్తున్న షాపును పరిశీలించేందుకు వెళ్లిన బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రజా సమస్యపై పోరాడుతుంటే పోలీసులు లిక్కర్ షాపు యజమానికి ప్రైవేట్ సెక్యూరిటీగా, ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేవలం యజమాని ఫిర్యాదు మేరకు ప్రజలను, మహిళలను అక్కడి నుండి వెళ్ళగొట్టడం, బెదిరించడం ఎంతవరకు సమంజసమని వారు పోలీసులను నిలదీశారు. ప్రైవేట్ ప్రాపర్టీ అయినా సరే, అది ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉంటే ప్రశ్నించే హక్కు తమకు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ప్రజలు, నాయకులు ర్యాలీగా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ అధికారులతో జరిగిన చర్చల్లో బీజేపీ నేతలు పలు కీలక అంశాలను లేవనెత్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దేవాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులకు 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలనే రూల్ ఉన్నప్పటికీ, అధికారులు కేవలం టేపులతో కొలతలు వేసి 101 లేదా 102 మీటర్లు ఉందని టెక్నికల్ గా అనుమతులు ఇవ్వడం సరికాదని హితవు పలికారు. చట్టంలోని అక్షరాలకంటే, చట్టం వెనుక ఉన్న ఉద్దేశం ముఖ్యమని, పక్కనే ఉన్న హాస్పిటల్స్ లో పనిచేసే నర్సులు, రాత్రి వేళల్లో విధులు ముగించుకుని వెళ్లే మహిళలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంతంలో వైన్ షాప్ ఏర్పాటుచేస్తే తాగిన మైకంలో ఆకతాయిలు చేసే న్యూసెన్స్ వల్ల స్థానిక నివాసితులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడతారని, హిందువుల పవిత్ర మనోభావాలు దెబ్బతింటాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎక్సైజ్ అధికారులు, ఇంకా పూర్తి స్థాయి ప్రతిపాదనలు ఖరారు కాలేదని, 100 మీటర్ల నిబంధనతో పాటు ప్రజల అభ్యంతరాలను, క్షేత్ర స్థాయి వాస్తవాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయి విచారణ జరిపి వివరాలు తెలియజేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. అయితే, ప్రజా వ్యతిరేకత ఉన్న ఈ షాపును తక్షణమే రద్దు చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. గడిల నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శీలం పాపారావు, నాయకులు వీరవెల్లి రాజేష్ గుప్తా, బోయినపల్లి సురేష్, మంద సరస్వతి, రుద్రగాని మాధవ్, రీగన్ ప్రతాప్, పాలెపు రాము, కందుల శ్రీకృష్ణ, రజినీ రెడ్డి, మనీ, తుమ్మ హిందూ, మేడా సంపత్, పొట్టిమూర్తి జనార్ధన్, పోటీమూర్తి వాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యత మేరకు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలి: జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



**కడప నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో లక్ష్యం మేరకు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి వరి ధాన్యం కొనుగోలు, మహిళలపై నేర నియంత్రణ, గంజాయి, మత్తు పదార్థాల నివారణ, సానుకూల ప్రజా దృక్పథం, జీఎస్ డబ్ల్యుఎస్ సేవలు, మున్సిపల్ సేవలు – పారిశుద్ధ్య చర్యలు, ఆర్.టి.జి.ఎస్, సంక్షేమ శాఖ హాస్టళ్లు మరియు రెసిడెన్షియల్ పాఠశాలలు, తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జేసీ అదితి సింగ్ హాజరయ్యారు.సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబందిత అధికారులతో జేసీ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సంబందిత శాఖల అధికారులు ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు, మాధకద్రవ్యాల నిరోధం, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు.. తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా సేవలను మెరుగుపరచాలన్నారు. ఈ విషయంలో అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చామనపల్లి గ్రామ బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మునిగంటి కుమార్...



**కరీంనగర్ రూరల్,నవంబర్27(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామ బిజెపి సర్పంచ్ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర నాయకులు మునిగంటి కుమార్ గురువారం రోజున నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్ రూరల్ బిజెపి మండల నాయకులు, జిల్లా నాయకుల తో కలసి కరీంనగర్ రూరల్ ఎన్నికల కార్యాలయంలో మునిగంటి కుమార్ నామినేషన్ పత్రాలు ను ఎన్నికల అధికారికి అందజేశారు. మునిగంటి కుమార్ మాట్లాడుతూ చామనపల్లి గ్రామ అభివృద్ధి కోసం బిజెపి అభ్యర్థి గా బరిలో నిలిచిన తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకొని ముందుకు కొనసాగుతున్నారన్నారు. సర్పంచిగా తనకు అవకాశం కల్పిస్తే చామనపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం శాయ శక్తుల కృషి చేస్తానని మునిగంటి కుమార్ ఈ సందర్భంగా చెప్పారు.

## ఒలంపియాడ్ టెస్ట్‌లో వైష్ణవి, జూనియర్ విభాగములో సిద్దు మొదటి స్థానం



**వెల్గటూర్, నవంబర్27(పీసీడబ్ల్యూ న్యూస్):**జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి వెల్గటూర్ ఆదర్శ పాఠశాలలో చదువుతున్ని వైష్ణవి మరియు సృజన లకు పదవ తరగతి ఇంగ్లీషు ఒలంపియాడ్ టెస్ట్ సీనియర్ విభాగం లో మండల్ లెవెల్ లో మొదటి స్థానం,జూనియర్ విభాగంలో ఎమ్.సిద్ధూ మొదటి స్థానం సాధించినట్లు మెడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఆంగ్ల ఉపన్యాసం లోనూ, వ్యాస రచనలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులను సహకరించిన ఉపాధ్యాయు లను ఉన్నతాధికారులు, తల్లిదండ్రులు అందించారు.

## యూ.సి.ఓ పరీక్షలో శ్రీ చైతన్య ప్రభంజనం

**• జాతీయస్థాయిలో సత్తా చాటిన సత్తుపల్లి విద్యార్థులు: ప్రిన్సిపాల్ నాగరాజు**



**సత్తుపల్లి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జాతీయస్థాయి యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్ (యూ.సి.ఓ) పరీక్షలో సత్తుపల్లి విద్యా శ్రీచైతన్య కరికులం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గత నెలలో నిర్వహించిన యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారన్నారు. ఈ ప్రతిష్టాత్మక పరీక్షల్లో ఆల్ ఇండియా 7వ ర్యాంక్‌ను దాసరి ఖాస్వి, 10వ ర్యాంక్‌ను ఆర్. కెనీషా, 12వ ర్యాంక్‌ను మన్విత సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థులు క్యాష్ ప్రైజ్, గోల్డ్ మెడల్, అవార్డు, సర్టిఫికేట్ అందుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అదేవిధంగా బాలుర విభాగంలో తన్షిక్ నాయుడు, సాయి చరణ్, సాత్విక్, హర్ష వర్ధన్ మంచి ప్రతిభ కనబరుచుతూ గోల్డ్ మెడల్, సర్టిఫికేట్లను గెలుచుకున్నారు.విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్స్ శ్రీధర్, శ్రీవిద్యా మేడమ్, ఖమ్మం జోన్ కో–ఆర్డినేటర్ కృష్ణారావులు అభినందించి ఇలాంటి జాతీయస్థాయి పోటీల్లో చురుకుగా పాల్గొని, మీ ప్రతిభను దేశవ్యాప్తంగా ప్రదర్శించి మరిన్ని అవార్డులు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ అజిత, డీన్ ఎన్.వి.ఆర్,సి ఇంచార్జి నాగార్జున, ఐఎన్‌టీఎస్‌ఓ ఇంచార్జి సుభాకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను అభినందించారు.

# 3 విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు: జడ్పీ సీఈఓ నరేందర్

**• పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పత్రిక సమావేశం నిర్వహించిన జడ్పీ సీఈఓ**



**పెద్దపల్లి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూన్యూస్):** పెద్దపల్లి జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జడ్పీ సీఈఓ నరేందర్ తెలిపారు. గురువారం జడ్పీ సీఈఓ నరేందర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్యతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ నరేందర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా పరిధిలో 263 గ్రామ పంచాయతీ సర్పంచ్, 263 ఉప సర్పంచ్, 2432 వార్డు సభ్యుల ఎన్నిక 3 విడతల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడత డిసెంబర్ 11న 99 గ్రామాలు, 896 వార్డులకు , రెండవ విడత డిసెంబర్ 14న 73 గ్రామాలు, 684 వార్డులకు , మూడవ విడత డిసెంబర్ 17న 91 గ్రామాలు, 852 వార్డులకు ఎన్నికల జరుగుతాయని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్, కౌంటింగ్ ఒకే రోజు జరుగుతాయని, ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత అక్కడే కౌంటింగ్ నిర్వహిస్తామని, కౌంటింగ్ ముగిసిన తర్వాత అదే రోజు వార్డు మెంబర్ల ద్వారా ఉప సర్పంచ్ ఎన్నికలు జరుగుతుందని తెలిపారు.మొదటి విడత పంచాయతీలకు నవంబర్ 27న , రెండో విడత పంచాయతీలకు నవంబర్ 30న, మూడో విడత పంచాయతీలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి 3 రోజుల పాటు నామినేషన్లకు ,తర్వాతి రోజు నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల ప్రకటన ఉంటుందని, తర్వాత జాబితా పై అప్పీల్స్ స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు.నామినేషన్ల ఉపసంహరణ మొదటి విడత పంచాయతీలకు డిసెంబర్ 3, రెండో విడత పంచాయతీలకు డిసెంబర్ 6, మూడో విడత పంచాయతీలో డిసెంబర్ 9 మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంటుందని, అదే రోజున పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. 5 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ పోటీ చేసే అభ్యర్థులు 2 లక్షల 50 వేల రూపాయలు, వార్డు మెంబర్ 50వేల రూపాయలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు లక్ష 50 వేల రూపాయలు, వార్డు మెంబర్ 30 వేల రూపాయలు గరిష్టంగా ప్రచార నిమిత్తం ఖర్చు చేసే వీలు ఉందని ఆయన తెలిపారు.జనరల్ కేటగిరి సర్పంచ్ అభ్యర్థి రెండు వేల రూపాయలు వార్డు మెంబర్ అభ్యర్థి 500 రూపాయలు, బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వ్ స్థానాలలో సర్పంచ్ అభ్యర్థి వెయ్యి రూపాయలు, వార్డ్ మెంబర్ అభ్యర్థి 250 రూపాయలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ ఖరారు చేసామని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం 3 ఎస్టి (మహిళలు1 ,జనరల్ 2) ,54 ఎస్సీ (మహిళలు 24 ,జనరల్ 30) , 69 బీసి (మహిళలు30 , జనరల్ 39 ,134 ఓపెన్ క్యాటగిరి (మహిళలు65 , జనరల్ 69 రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 4లక్షల 4 వేల 181 మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారని, 274 పోలింగ్ లొకేషన్ లలో 2432 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 85 రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు కలిపి 3804 సిబ్బందిని నియమించామని అన్నారు.సమస్యాత్మక ప్రాంతాలలో గుర్తించిన 1099 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఎంసిసి కోడ్ ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రచార ఖర్చులను నమోదు చేసేందుకు ధరల లిస్టు సిద్ధం చేశామని అన్నారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా ఎం.సి.ఎం.సి అనుమతి తీసుకోవాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, జర్నలిస్టులు, పాత్రికేయులు, వివిధ వర్గాల ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని జడ్పీ సీఈఓ కోరారు. సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపరుల ఆరోపణలు పట్టించుకోవద్దు

**• కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైద్యుల అంజన్ కుమార్**

**కరీంనగర్,నవంబర్27(పీసీడబ్ల్యూ న్యూస్):** బిఆర్ఎస్ నేతలు చల్లా హరిశంకర్ పత్రికా విలేకరుల సమావేశం ద్వారా కాంగ్రెస్ పార్టీ పై కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, మరియు మాజీ మేయర్ బిజెపి నేత వై సునీల్ రావు ప్రజా పాలన పట్ల ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ చేపడుతున్న సంతకాల సేకరణను ప్రజలు విశ్వసించరని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పేర్కొన్నారు.నేడు నగరంలోని వారి నివాసంలో మీడియాను ఉద్దేశించి వీడియో సందేశం ద్వారా అంజన్ కుమార్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు మున్సిపల్ కార్పొరేషన్ ను ఏలిన బిఆర్ఎస్ పాలకవర్గం చేసిన అప్పు మున్సిపల్ చెత్తకు మించిన దానిలా ఉంది, బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం మున్సిపల్ కార్పొరేషన్ లో మేయర్ స్థానం కైవసం చేసుకున్న తర్వాత 2015 నుండి 2017 వ సంవత్సర కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్ కార్పొరేషన్ కు సంవత్సరానికి 100 కోట్ల చొప్పున 300 కోట్లు ఇస్తున్నామని జీవో విడుదల చేసిన తర్వాత టెండర్ల ద్వారా చేపట్టిన పనుల్లో కొన్నిటికి మాత్రమే బిల్లులు ఎందుకు ఇచ్చినారు మిగతా వాటిని ఎందుకు పెండింగ్లో పెట్టినారు ఎందుకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అప్పుల్లో కూరుకుపోయిందో గత బిఆర్ఎస్ పాలకవర్గంలో సభ్యులైన చల్లా హరిశంకర్ కి ఆ పార్టీ నేతలకు పూర్తి అవగాహన ఉంది.ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని 2018లో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ కమిషన్ల కోసం అభివృద్ధి పనుల పేరమీద మళ్లీ 193 కోట్లు విడుదల చేసి ప్రారంభించిన పనులు 2023 కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేనాటికి పూర్తి చేకపోవడం, బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలో వదిలి వేయడం జరిగింది ఇది వాస్తవం కాదా దీనిపై బహిరంగ చర్చకు బిఆర్ఎస్ నేతలు సిద్ధమా అని సవాల్ విసురుతున్నాం.మా ప్రభుత్వం పై, మా మంత్రులపై అవాకులు చివాకులు పేలే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులను తీర్చడానికి, ఆ భారం ప్రజలపై పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పురోగతి సాధిస్తుంటే బిఆర్ఎస్ నేతలు ఏ విధంగా విమర్శలు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నాం.మంచినీటి సరఫరా పై బిఆర్ఎస్ నేతలు చేసిన విమర్శల్లో వాస్తవం లేదు, వీటిపై చర్చించేందుకు మేము సిద్ధం. లో లెవెల్ జోన్ పరిధిలోని కరీంనగర్ పట్టణంలో ప్రతిరోజు మంచినీటి సరఫరా కొనసాగుతుంది, విలీన గ్రామాల్లో హై లెవెల్ జోన్ లోని పలు ప్రాంతాల్లో సమయాభావం వల్ల ఏర్పడిన సాంకేతిక ఇబ్బందులతో డే బై డే నీటి సరఫరా కొనసాగుతుంది. ప్రతి వేసవికాలంలో మానేరు డ్యాములో డెడ్ లెవెల్ స్టోరేజ్ కి నీటి స్థాయి పడిపోయినప్పుడు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ కార్పొరేషన్ పరిధిలో డే బై డే నీటి సరఫరా కొనసాగుతుంది, ఇది గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా జరిగిన విషయం వాస్తవం కాదా..?వీధి దీపాల విషయంలో గత ప్రభుత్వం రాష్ట్రమంతటా ఎల్ఈడీ లైట్లు అమర్చే విధానంలో భాగంగా బొంబాయికి చెందిన ఒక ప్రైవేట్ కంపెనీకి టెండర్ల ద్వారా లీజుకి ఇవ్వడం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఆ వ్యవస్థ కొనసాగినప్పటికీ లీజు పూర్తయిన తర్వాత చేపట్టవలసిన కార్యచరణ గురించి గత పాలకులు ఎలాంటి పత్రాలు కానీ అగ్రిమెంట్లు గానీ రాయలేదు, ప్రస్తుతం ఎల్ఈడీ లైట్లు పోయిన చోట కొత్త లైట్లు అమర్చే పనులు జరుగుతున్నాయి టెండర్ల ప్రక్రియ కొనసాగుతుంది.బిఆర్ఎస్ పాలనలో మంచిగా ఉన్న రోడ్లను ధ్వంసం చేసి కొత్త రోడ్లు వేసే పేరుతో ప్రజాధనాన్ని వృధా చేస్తూ కమిషన్లు దండుకున్నారు తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదు, పెద్ద ఎత్తున అవినీతి కుంభకోణాలు చేసినారు లేని



గుట్టలను సృష్టించి వాటిని తొలగించినట్లుగా లక్షల రూపాయలు కాజేసినారు ఆ లావాదేవీలకు సంబంధించిన ఎంబి బుక్కులను మాయం చేసినారు, కరీంనగర్ నగరపాలక సంస్థను పూర్తి అవినీతిమయం చేసి దీనిపై చర్చించకుండా ప్రభుత్వంపై నిందలు వేసే పని పెట్టుకున్న బిఆర్ఎస్ నేతలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. ఈ విధమైన అబద్ధపు ప్రచారాలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తున్నాం. మాజీ మేయర్ గా అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్న బిజెపి నేత సునీల్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ సంతకాల సేకరణ చేపట్టడం సిగ్గుచేటు. బిఆర్ఎస్ పాలనలో అవినీతిమయమైన మున్సిపల్ కార్పొరేషన్ లో ఆ పార్టీకి ప్రజలు ఓటు వేయాలని ఉద్దేశంతో తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి దోచుకున్న సొమ్మును దాచుకోవడానికి బిజెపి లోకి చేరిన సునీల్ రావు స్మార్ట్ సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించింది కేసీఆర్ అని, బండి సంజయ్ ఒక్క రూపాయి తెచ్చింది లేదని ఒకసారి, కార్పొరేషన్ అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం ద్వారా జరిగిందని మరొకసారి ఈ విధంగా రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తూ ప్రజల వద్ద నమ్మకం కోల్పోయారు,కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినటువంటి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి అమలు చేసిన హామీల గురించి చర్చించడానికి మేము సిద్ధం, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలపై చర్చించేందుకు మీరు సిద్ధమా అని ప్రశ్నిస్తున్నాం.

# కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ప్రశంసనీయం...

**• బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**





**జమ్మికుంట,నవంబర్27(పీసీడబ్ల్యూ న్యూస్):**వ్యవసాయ పరిశోధనా ఫలాలు స్థానిక రైతుల పొలాలలో ఆచరించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ప్రశంసనీయమని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి శ్లాఘించారురైతు నాయకులు కృష్ణారెడ్డి చొప్పదండి మండల రైతులతో కలిసి జమ్మికుంట లోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కెవికె శాస్త్రవేత్తలు తాము పండిస్తున్న పలు పురాతన దేశీయ వరి వంగడాలను,జీవ వనరుల కేంద్రం చూపించారు.గడిచిన సంవత్సరం నుండి 1483 మంది రైతుల పొలాలలో సహజ వ్యవసాయం ఆచరింప చేస్తున్నామనిరానున్న 2సంవత్సరాలలో కెవికె పరిధిలో పదివేల ఎకరాలలో సుమారు 6000 మంది రైతులతోఎరువులు పురుగు మందులు లేకుండా పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తూ రైతుల ఆదాయాన్ని వినియోగదారుల ఆరోగ్యాన్ని పెంచే విధంగా సహజ సిద్ధ వ్యవసాయాన్ని ఆచరించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు కృష్ణారెడ్డి బృందానికి వివరించారు. రసాయన ఆధారిత గ్రోత్ ప్రమోటర్లకు బదులుగా సహజ సిద్ధమైన చేపల వ్యర్థాలు మరియు మజ్జిగ తో బెల్లం కలగలిపి సహజమైన గ్రోత్ ప్రమోటర్ రూపొందించి ఉపయోగిస్తున్నట్లు క్షేత్ర స్థాయిలో అవి మంచి ఫలితాలు ఇస్తున్నట్టు శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా తెలియజేశారు. గోమూత్రం సులభంగా సేకరించేలా కెవికె ఆవరణలో నిర్మించిన పశువుల షెడ్డులో ఆవు మూత్రం ట్యాంక్ లోకి వెళ్లేలా అతి తక్కువ ఖర్చుతో నిర్మించిన ట్యాంకునుశాస్త్రవేత్తలు ఈ సందర్భంగా రైతులకు చూపించారు. ఈ విధంగా సేకరించిన అవు మూత్రాన్ని గ్రోత్ ప్రమోటర్ల లోనూ మరో వైపు సహజ కీటక నాశిని గాను కేవికే ప్రయోగాల్లో విజయవంతంగా వినియోగిస్తున్నారు.పతి సంవత్సరం రైతులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు, వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తూ వ్యవసాయం లోని సమర్థ యాజమాన్య పద్ధతులు పాటించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని సీనియర్ శాస్త్రవేత్త వేంప్కటేశ్వర రావు రైతు బృందానికి తెలియచేసారు.కే వి కె పరిధిలోని అనేక మంది రైతులు వివిధ జాతీయ అవార్డులు గెలుచుకోవడం పట్ల సింగిరెడ్డి కృష్ణారెడ్డి కేవీకే శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర వ్యవసాయ బడ్జెట్ ను ఆరు రెట్లు పెంచిందని, రైతు ఆదాయాన్ని పెంచే విధంగా వ్యవసాయ విధానాలు రూపొందిస్తున్నదని, పంట సేకరణ ధరలు రెట్టింపు చేసిందని, అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు పెరిగినప్పటికీఆ భారం రైతు పై పడకుండా ఎరువుల సబ్సిడీ మూడింతలు పెంచిందని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రసాయన రహిత సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నదని రైతులు కూడా కే వి కే సేవలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేవీకే మత్స్య విభాగం శాస్ర వేత్త జి. ప్రభాకర్, ప్రొగ్రాం అసిస్టెంట్ కే. సుప్రజ, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు కోర్డినేటర్ కుమార్ యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మిరెడ్డి, రైతులు మొగిలి మహేష్, రాపల్లి శ్రీనివాస్,గుండె వెంకటేష్, కాయిత సాయి పాల్గొన్నారు.



# బాల రచయిత్రి కొల్లి చంద్రికకు అంతర్జాతీయ గుర్తింపు



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక నవంబర్ 30న ఆన్లైన్లో 13 గంటల పాటు అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం బాలసాహిత్య భేరి-2025 ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ విశేషమైన కార్యక్రమంలో పాల్గొనుటకు ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంఎస్పీ కాలనీ పదవ తరగతి విద్యార్థిని, బాల రచయిత్రి కుమారి కొల్లి చంద్రిక ఎంపికయ్యారు. కథ, కవిత్వం, గేయం, పద్యం విభాగాల్లో ప్రపంచవ్యాప్తంగా 101 మంది బాల, బాలికలు పాల్గొంటుండగా చంద్రిక కథ విభాగంలో తన కథను మూడు నిమిషాల్లో వినిపిస్తుంది. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ లు, కేంద్ర సాహిత్య అకాడమీ ఆవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థినికి అరుదైన అవకాశం కల్పించినందుకు తానా ఆధ్యక్షులు డాక్టర్ నరేన్ కొడాలి, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయకర్త చిగురుమల్ల శ్రీనివాసుకు కృతజ్ఞతలు. బాలసాహితీవేత్త కవి రచయిత తెలుగు ఉపాధ్యాయులు కోండ్రు బ్రహ్మం ప్రోత్సాహంలో చంద్రికకు ఈ అవకాశం లభించడం ముదావహం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చావా దుర్గాభవాని తెలిపారు.

# ఐక్య క్రిస్మస్ సంబరాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

- కల్లూరు మండలం ఏఐసీసీ కమిటి



**కల్లూరు, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరులో డిసెంబర్ 9న జరిగే ఐక్య క్రిస్మస్ సంబరాలకు సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమై దయానంద్, రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ కు ఏఐసిసి మండల కమిటీ అధ్యక్షులు రెవరెండ్ తేళ్ల ఎబినేజర్ ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య క్రిస్మస్ సంబరాలకు అంతర్జాతీయ సువార్తికులు యంగ్ హోలీ టీం వ్యవస్థాపకులు డాక్టర్ జాన్ వెస్లీ రానున్నారనీ అన్నారు. ఈ సభలకు సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్,రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఏఐసీసీ మండల కమిటీ ప్రేమ పూర్వక ఆహ్వానాన్ని అందించడం జరిగింది.వారు సానుకూలంగా స్పందించి క్రిస్మస్ సంబరాలకు వస్తానని వారు అన్నారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మీడియా సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు ,మండల అధ్యక్షులు రెవ తేళ్ల ఎబినేజర్ ,ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ దయాకర్, ప్రధాన కార్యదర్శి మోదుగు జాన్ పరంజ్యోతి,ఐక్య క్రిస్మస్ సంబరాల కోశాధికారి ఆదూరి రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు.

# విధినిర్వహణలో కండక్టర్ చేసిన మేలు

- విద్యార్థినికి అప్పగించిన విలువైన వస్తువులు
- మానవత్వం చాటుకున్న హనుమకొండ 2 డిపో డ్రైవర్, కండక్టర్లు




**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 27(పిసీడబ్ల్యూ న్యూస్):** గతంలో ఆర్టీసీ బస్సులో ఏ ప్రయాణికుడైన తన వస్తువులను మరిచిపోతే తిరిగి అవి వారికి దక్కేవి కాకుండా పోయేవి. ఆ రోజుల్లో టిక్కెట్లు పై ఎలాంటి సమాచారం లేకపోవడంతో బస్సులో మరిచిపోయిన వస్తువులను చివరిగా డిపోలకు వెళ్లే సమయంలో అందులో మిగిలి ఉంటే సెక్యూరిటీ వాళ్ళకి అప్పగించేవారు. వస్తువులు మర్చిపోయిన వాళ్లు బస్సుల ఆచూకీ తెలుసుకొని డిపోల వద్దకు వెళ్లేసరికి ఎంతో సమయం పట్టేది. ఇప్పుడున్న పరిస్థితులు వేరు టీ జి ఎస్ ఆర్ టి సి లో కొత్తగా ప్రవేశపెట్టిన టీం సర్వీసులు టికెట్ తీసుకునే ప్రయాణికునికి టిక్కెట్లోని కండక్టర్ సెల్ నెంబర్ తో పాటు బస్సు ఎటు నుండి ఎటు వెళ్తుందని సూచించడం జరుగుతుంది. దీనివలన ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుంది. బస్సులో ఏ వస్తువు మరిచిపోయినా అందులోని కండక్టర్ నెంబర్ కు లేదా సంబంధిత డిపో కంట్రోలర్ నెంబర్ కు ఫోన్ చేస్తే బస్సు ఎక్కడ ఉంది వస్తువులు ఏమైనా మిగిలిపోయి ఉన్నాయా ఆ వస్తువులను ఎక్కడ అందజేయాలి అని సమాచారం తెలుసుకునే అవకాశాన్ని ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు మేలు చేసే విధంగా టీం టికెట్లను తయారు చేశారు. వివరాలలోనికి వెళితే గురువారం ఉదయం హనుమకొండ 2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సూర్యాపేట నుండి తొర్రూరు ద్వారా హనుమకొండ కు వెళ్లాల్సి ఉంది. బి ఫార్మసీ చదివే ఒక విద్యార్థిని సరిత సూర్యాపేట బస్సు లో కి ప్రవేశించి తన వస్తువులను సీటుపై పెట్టి వాష్ రూమ్ కి వెళ్ళింది. బస్సులోని కండక్టర్ వస్తువులను గమనించి మిగతా ప్రయాణికులను ఈ వస్తువులు ఎవరివి అడగగా ఎవరు మావి కావని తెలపడంతో ప్రయాణించే ప్రయాణికురాలు కొరకు...

# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం...

**42% రిజర్వేషన్ హామీ ఏమైంది?**

**పంచాయతీ రిజర్వేషన్లలో బీసీలకు తీవ్ర అన్యాయం.**

**రాష్ట్రంలో కులగణాలో 5 నుండి6% తగ్గించి చూపడం.**

**రాష్ట్రంలో 12,735 గ్రామాలకు 2,176 గ్రామాలు మాత్రమే బీసీలకు ఇచ్చి, 17.08% రిజర్వేషన్లతో ప్రభుత్వం చేసిన మోసం.**

**బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్**



**మల్లంపల్లి మండల ప్రతినిధి నవంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎలెక్షన్ కమిషన్ విడుదల చేసిన స్థానిక సంస్థల నోటిఫికేషన్ను తీవ్రంగా ఖండిస్తున్నాము అని బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు .కామారెడ్డి బీసీ డిక్లరేషన్లో స్పష్టంగా హామీ ఇచ్చిన 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్లడం ప్రభుత్వం బీసీలపై చూపుతున్న నిర్లక్ష్యం, అని ఆయన పేర్కొన్నారు.బీసీలను ఓటు బ్యాంక్గా చూసుకుని ఎన్నికల సమయంలో ఏకంగా 42% రిజర్వేషన్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అధికారంలోకి రాగానే మా హక్కులను పక్కనబెడుతోంది. ఇది బీసీలను మోసం చేయడమే కాదుమా అస్తిత్వాన్ని, మా రాజకీయ హక్కులను హరిస్తున్న దారుణ చర్య. బీసీ వర్గాల నుండి వచ్చే ఆవేదనను గట్టిగా వ్యక్తం చేస్తూ ఆయన మరింతగా పేర్కొన్నారుబీసీలు మౌనంగా ఉండరు. మా స్వరం మా శక్తి. బీసీలు ఒకటై నిలబడితే ఏ పార్టీకైనా అసలు నిజమైన శక్తి ఎవరిదో చూపించగలం. 2028లో అగ్రకులాల ఆధిపత్యం, వారిచే జరుగుతున్న రాజకీయ దోపిడీకి శాశ్వత సమాధి కడతాం.అలాగే బీసీ విద్యార్థులు, యువత, సంఘాలు అన్నీ గట్టిగా స్పందించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# విప్లవ రాణా పుట్టినరోజు సందర్భంగా బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పచ్చదనం - పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం



**బెల్లంపల్లి నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రాంగణంలో ప్రముఖ సామాజిక కార్యకర్త రంగ ప్రశాంత్ రజిత కుమారుని ద్వితీయ జన్మదినాన్ని పురస్కరించుకొని కళాశాలలో ప్రత్యేకంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంజయ్య ఆశీస్సులు తీసుకొని, చిన్నారి చేతులతో పలు పండ్ల మొక్కలు, షో చెట్లను నాటడం జరిగింది. కళాశాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పట్ల అభిరుచి కలిగిన రంగ ప్రశాంత్ ని ఈ కార్యక్రమం కోసం సుమారుగా ?3,500 విలువైన మొక్కలను కళాశాలకు బహుమతిగా చేయడం విశేషం. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంజయ్య మాట్లాడుతూ "కళాశాలకు మొక్కలను అందించి పచ్చదనం పెంపొందించేందుకు ముందుకు వచ్చినందుకు ప్రముఖ సామాజిక కార్యకర్త ప్రశాంత్ కి మా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. వారి కుమారుడు ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులను సంతోషంగా జరుపుకోవాలని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సత్కార్యాలకు ముందుండాలని కోరుకుంటున్నాం" అని అభినందనలు తెలిపారు. ప్రతి కుటుంబలో సభ్యులు ఎవరో ఒక పుట్టినరోజు జరుపుకున్న సందర్భంలో చెట్లను నాటడం ఆనవాయితీగా పెట్టుకుంటే సమాజం ప్రకృతి అభివృద్ధి చెందుతున్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యాసిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారి జన్మదినాన్ని ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం మిఠాయిల పంపిణీ నిర్వహించారు.

# 'రైల్వే మెగా ఫ్రైట్ డిపో'ను ఏర్పాటు చేయాలి

- డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాలా సుమేర్ జైన్



**డోర్నకల్ ప్రతినిధి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** డోర్నకల్లో రైల్వే మెగా ఫ్రైట్ డిపో'ను ఏర్పాటుచేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ్సహాయం రఘురాం రెడ్డినీ డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కాలా సుమేరు జైన్ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట జిల్లాలో ముఖ్యమైన రైల్వే జంక్షన్గా ఉన్న డోర్నకల్, భౌగోళికంగా కూడా రవాణాకు అనుకూల కేంద్రంగా నిలుస్తోంది. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు కలుపుతూ, వాణిజ్య రవాణాలో కీలక పాత్ర పోషించే ఈ రైల్వే స్టేషన్ వద్ద 'మెగా ఫ్రైట్ డిపో' ఏర్పాటు చేయాలని డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాలా సుమేర్ జైన్ అన్నారు. ఈ విషయం ప్రజల్లో, వ్యాపార వర్గాల్లో బలపడుతోందన్నారు.దక్షిణ మరియు తూర్పు భారత రూట్లకు సెంటర్ పాయింట్ డోర్నకల్ జంక్షన్లో రోజూ భారీగా రైళ్లు వెళ్లడం వల్ల సరుకు రవాణా విస్తరించడానికి ఇది అత్యుత్తమ స్థలం. వ్యాపారానికి ఊతం మెగా ఫ్రైట్ డిపో ఏర్పాటుతో వరి, మిర్చి, పత్తి, ఇనుము, నిర్మాణ సామగ్రి వంటి సరుకులు తక్కువ ఖర్చుతో దేశవ్యాప్తంగా రవాణా అవుతాయి. పరిశ్రమల అభివృద్ధి, కొత్త పరిశ్రమలు, గోదాములు, రైలు షెడ్లు ఏర్పడి స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రాంతానికి ఆర్థిక లాభం డోర్నకల్ ఖమ్మం జిల్లా, సూర్యాపేట, వరంగల్ జిల్లాలకు సరుకుల రవాణా కేంద్రంగా మారే అవకాశం ఉంది. ఈ యొక్క సమావేశంలో రైల్వే సంఘ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ బషీర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గారె రమేష్, ధారావత్ కృష్ణ తదితరులు ఉన్నారు.

# డిసిసి అధ్యక్షులు ఇనగాలను సన్మానించిన మహమ్మద్ రహమతుల్లా



**హనుమకొండ,నవంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా గురువారం రోజున హనుమకొండలో యూత్ కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ రహమతుల్లా మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఇనగాల వెంకట్రాంరెడ్డి ని శాల్వతో ఘనంగా సన్మానించారు. పూలబొకతో శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని అన్నారు. ఖమ్మం నూతన కలెక్టరేట్ భవనములోని మీటింగ్ హాల్లో జిల్లాలోని 28 పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమక్షా సమావేశంలో ప్రతి ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలకు ఏఏ ఇంటర్వెన్షన్ ద్వారా ఏఏ నిధులు వచ్చినాయి అనే విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకుని వచ్చారు. అదేవిధంగా తమ తమ పాఠశాలలో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాల అమలు తీరుతెన్నులను వివరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేటువంటి బాల బాలికలకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని, పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని రంగాలలో ముందంజలో ఉండేలా వినూత్నమైన కార్యక్రమాలకు రూపకల్పన జరపాలని సూచించారు. విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు తీసుకు వెళ్లడం, వారికి శాస్త్ర సాంకేతిక రంగాలు, పరిశోధన, అభివృద్ధి రంగాలపై మక్కువ పెరిగేలా మరిన్ని ఇంటరాక్షన్ కార్యక్రమాలను ఏర్పాటుచేయాలని సూచించారు.అదేవిధంగా ఒకేషనల్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ బాలికలకు ఆత్మరక్షణ విద్యను బాలురకు ఇతర ఒకేషనల్ శిక్షణలు అందజేస్తూ పీఎం శ్రీ 'పాఠశాలలు ది బెస్ట్' అనిపించుకునేలా ఉండాలని సూచించారు. ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, క్వాలిటీ కో-ఆర్డినేటర్ పెసర ప్రభాకర్ రెడ్డి, జెండర్ ఈక్విటీ కో-ఆర్డినేటర్ రూబీ, మండల విద్యాశాఖ అధికారులు వీరస్వామి, వెంకటేశ్వర్లు, నివేదిత, సత్యనారాయణ, జిల్లాలోని 28 పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిపై అపోహలు వద్దు

**పత్తికొండ నవంబర్ 27(పిసిడబ్ల్యూ న్యూస్):** కుష్టు వ్యాధిపై అపోహలు పెట్టుకోరాదని సూపర్వైజర్లు వెంకటేశ్వర్లు, సాయిబాబా, ప్రకాష్ అన్నారు. గురువారం పత్తికొండ లో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమంఎస్సీ కాలనీ, మరియు నాయి బ్రాహ్మణ కాలని లో నిర్వహించారు. కుష్టు వ్యాధిపై అవగాహన సర్వే నిర్వహిస్తూ ఆ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు వెంకటేశ్వర్లు, సాయిబాబా, ప్రకాష్ ప్రజలకు తెలియజేశారు . అలాగే ఈ కార్యక్రమం ఈనెల 30వ తేదీ వరకు జరుగుతుందని, గ్రామంలోని ప్రతి ఇంటిని, ప్రతి ఆశ సందర్శించి వారి వివరాలు సేకరిస్తారన్నారు. అనుమానిత కేసులను రిజిస్టర్ చేసుకుని డాక్టర్ చేత పరీక్షించి నిర్ధారితమైన కేసులను కర్నూలు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పుష్పలత, చాముండేశ్వరి, మరియు పుష్ప, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# అభివృద్ధి సంక్షేమ పథకాలే గెలుపుకు శ్రీకారం

**ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్**
**స్థానిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే**
**కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు**







**పెనుబల్లి,నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకు శ్రీకారం చూడతాయని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పెనుబల్లి మండలం, రామచంద్రపురం గ్రామం నుండి గురువారం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ శ్రీకారం చుట్టారు. రామచంద్రపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు కరిముల్లా సతీమణి షేక్ రిజ్వానా ను గ్రామ ప్రజల అందరి ఆమోదంతో సర్పంచ్ అభ్యర్థిగా ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని రామచంద్రపురం గ్రామస్తులను కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇతర మంత్రులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆధ్వర్యంలో భారీ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, బడుగు బలహీన వర్గాలకు భరోసాగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీని ఈ ప్రాంత ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ వైపు నడుస్తున్నారని, రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గంలో అన్ని సర్పంచుల అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు, చిన్న స్వామి, షేక్ కరీముల్లా, రామచంద్రపురం, ఏరుగట్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే బాల్య వివాహాల నిర్మూలన

**- సిడబ్ల్యూసీ చైర్పర్సన్ భారతరాణి**
**- ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా చూద్దాం**
**- జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత**










**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల భాగస్వామ్యంతో బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమవుతోందని, ఖమ్మం జిల్లాలో నేటి నుండి ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా చూద్దామని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ గుంటుపల్లి భారతరాణి పిలుపునిచ్చారు. నవంబర్ 27 జాతీయ బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని స్థానిక గాంధీ చౌక్ నందు బాలికల జూనియర్ కళాశాలలో గురువారం వందరోజుల బాల్య వివాహ నిరోధక కార్యాచరణ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ... బాల్య వివాహాల నిర్మూలన అనేది ప్రజల భాగస్వామ్యంతో కూడుకున్న అంశమని ప్రజలు, యువత, కౌమార బాలబాలికలు, అధికారులు ఇలా అందరి సమన్వయం, సమిష్టి కృషితో ప్రయత్నం చేస్తే 2030 లోపే బాల్య వివాహాలను మనం ఖమ్మం జిల్లాలో సమూలంగా నిర్మూలించవచ్చని పునరుద్ఘాటించారు. బాలికలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాతనే వివాహం గురించి ఆలోచించాలని బాలలకు సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, భేటీ పడావో బేటి బచావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లల యొక్క విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పట్ల నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలు ఎవరైనా చేసినా, ప్రోత్సాహించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాలల సమస్యల పరిష్కారానికి 'చైల్డ్ హెల్ప్ లైన్ 1098' కి ఫోన్ చేసి తెలపాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ మాట్లాడుతూ.. ఆడపిల్లలు కౌమార దశలో వచ్చి మార్పుల పట్ల ఆందోళన పడకుండా అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలలో నివృత్తి చేసుకోవాలని రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకుంటూ చక్కని ఆరోగ్యంతో చదివి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తేవాలని తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో చదివే బాల బాలికలకు మత్తు పదార్థాలు, సామాజిక మాధ్యమాలు, చరవాణి వినియోగం పట్ల ప్రతి వారాంతంలో విషయాన్ని నిపుణులచే కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారిని సరైన మార్గంలో ఉండేలా చూస్తున్నామని తెలిపారు. యువత భవిష్యత్తు పట్ల సరైన అవగాహనతోటి చదువుకోవాలని, చెడు వ్యసనాలకు బానిసైతే జీవితం దుర్భరం అవుతుందని అన్నారు. ఎయిడ్ సంస్థ డైరెక్టర్ వాణి హరి ప్రసాద్ రావు మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా జిల్లాలో గత మూడేళ్లుగా బాల్యవివాహాల నిర్మూలన బాలలపై లైంగిక దాడి, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణాలపై నిరంతరం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రజలకు పిల్లలకు అందరికీ అవగాహన కల్పిస్తూ 2030 లోపే బాల్యవివాహ రహిత జిల్లాగా ఖమ్మంను ప్రకటించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అందుకు సహకరిస్తున్న జిల్లా స్థాయి అధికారులందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరఫున డాక్టర్ డాక్టర్ బిందు శ్రీ హాజరై మాట్లాడుతూ.. చిన్న వయసులో బాల్యవివాహాలను చేయడం వలన బాలికలకు వచ్చే అనారోగ్య సమస్యలు, మానసిక, శారీరక ఇబ్బందులు, మాతా శిశు మరణాలు, రక్తహీనత, సుఖవ్యాధుల సంక్రమణం తదితర అంశాలపై వివరిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి బాలికలు తీసుకోవలసినటువంటి తగు జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో విజేతలైన వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు బహుమతుల ప్రధానం, మెమొంటోలు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే శిశు సంక్షేమ శాఖ ఉమెన్ హబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలలో విజేతలకు మెమొంటోలు సర్టిఫికెట్లను అతిధులు అందరి చేతులమీదుగా అందించడం జరిగింది. అనంతరం బాల్యవివాహాలను జరుపబోము, ప్రోత్సహించబోము అని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం నందు ఎయిడ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ పోపూరి వాణి, హరి ప్రసాద్ రావు, షీ టీం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ సెల్ బాధ్యులు ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, ఆరోగ్యశాఖ బాధ్యులు డాక్టర్ బిందుశ్రీ, శారద దుర్గ సుబ్రమణ్యం, వుమన్ హబ్ బాధ్యులు సమిరీన్, నరేష్, భాస్కర్ రాందాస్, రవీందర్, రవిచంద్ర, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధునిక జీవనశైలి: పైల్స్ (మొలశంక) బాధితులు పెరుగుతున్నారు!

**సిగ్గు వీడి చికిత్స తీసుకోవాలి: డాక్టర్ కూరపాటి రమేష్...**








**హుజూరాబాద్,నవంబర్27(పీసీడబ్ల్యూ న్యూస్) :** ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో మారుతున్న అలవాట్ల కారణంగా పైల్స్ (మొలశంక) బారిన పడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని హుజూరాబాద్‌లోని కూరపాటి లాపరోస్కోపి, లేజర్ హాస్పిటల్ డాక్టర్ కూరపాటి రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. వరల్డ్ పైల్స్ డే నవంబర్ సందర్భంగా, ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అన్నారు. తాజా గణాంకాల ప్రకారం, ప్రతి వంద మందిలో సుమారు 30 శాతం మంది పైల్స్ సమస్యతో బాధపడుతున్నారు. హైపర్‌టెన్షన్, డయాబెటిస్ మాదిరిగానే, మారుతున్న జీవనశైలి వల్ల దీని వ్యాప్తి కూడా పెరుగుతోందని డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ వ్యాధికి ప్రధాన సమస్య ఏమిటంటే, బాధితులు సిగ్గుపడి, మౌనంగా బాధపడుతూ సరైన సమయంలో చికిత్స తీసుకోకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతోందని వైద్యులు హెచ్చరించారు. “ప్రజలు సిగ్గుపడాల్సిన అవసరం లేదు. బహిరంగంగా వచ్చి డాక్టర్‌ను సంప్రదించాలి. సైలెంట్‌గా సఫర్ కావడం మానుకోవాలి,” అని ఆయన సూచించారు. పైల్స్‌కు ఎవరు చికిత్స అందిస్తారనే దానిపై సరైన అవగాహన లేక చాలా మంది నాటు వైద్యులను ఆశ్రయించడం వల్ల సమస్య మరింత తీవ్రమై, అనవసరమైన కాంప్లికేషన్స్‌తో ఆసుపత్రికి వస్తున్న కేసులు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు తెలిపారు. “పైల్స్‌కు ఎం.ఎస్. (మాస్టర్ ఆఫ్ సర్జరీ) డాక్టర్లు శాస్త్రీయమైన చికిత్స అందిస్తారని. నాటు వైద్యానికి చెక్ పెట్టాలి” అని కోరారు. నివారణ చర్యలలో భాగంగా.. పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం తప్పనిసరి. ఒకవేళ పైల్స్ బారిన పడితే, నొప్పి లేకుండా, అతి తక్కువ సమయంలో కోలుకునే విధంగా లేజర్ ట్రీట్‌మెంట్ వంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ రమేష్ వివరించారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణులైన డాక్టర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ప్రపంచ పైల్స్ దినోత్సవం సందర్భంగా, హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్‌కు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు హరిప్రసాద్, వేల్పుల రత్నం, రవీందర్ సారయ్య, సతీష్ పాల్గొన్నారు. ఉచిత సేవలు: ప్రపంచ పైల్స్ దినోత్సవం సందర్భంగా, కూరపాటి లాపరోస్కోపి, లేజర్ హాస్పిటల్‌లో నవంబర్ 25 నుంచి 30 వరకు పైల్స్‌తో బాధపడే వారికి ఉచిత ఓపీ సేవలు నిర్వహించబడునని తెలిపారు.

# ఐఎన్టీయూసీ యూనియన్ బలోపేతానికి కృషిచేయాలి

- **యూనియన్ నాయకులు గాదే మురళికృష్ణ**
- **కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఇంచార్జిగా గాదే మురళి**
- **నియామకపత్రం అందజేసిన కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్**



**సత్తుపల్లి, నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఐఎన్టీయూసీ యూనియన్ బలోపేతానికి కృషిచేయాలని యూనియన్ నాయకులు గాదే మురళికృష్ణ అన్నారు. సత్తుపల్లి సింగరేణిలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఇంచార్జిగా నియామక పత్రమును గురువారం కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు రజాక్ అందజేశారు. ఏర్పాటుచేసిన సమావేశంనకు ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్.. సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ యూనియన్ కృషి చేస్తుందని తెలియజేశారు. ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సత్తుపల్లిలో యూనియన్ బలోపేతానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సత్తుపల్లి ఇన్చార్జిగా గాదే మురళీకృష్ణను నియమించి నియామక పత్రాన్ని అందజేసినారు. రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో కాంట్రాక్ట్ ఉద్యోగులకు సింగరేణి సంస్థ లాభాలలో మొదటి సంవత్సరం 5 వేలు, రెండవ సంవత్సరం 5 వేల ఐదు వందల రూపాయలు ఇప్పించిన ఘనత ఐఎన్టీయూసీ యూనియన్ దే నన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరూ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. నాయకులు క్రాంతి కుమార్, రామారావు, బాలాజీ, పోచం శ్రీనివాస్, మల్లారపు కొమరయ్య, కొలుగూరి వెంకటస్వామి, బాజీ, రవిశంకర్, ఖాజా, చాంద్, ఐవి రెడ్డి, శ్రీధర్, సురేష్, శ్రీనివాస్, సందీప్, దావూద్, రాము, రాంబాబు, శ్రీధర్, అఫ్రోజ్, పాషా, రాజశేఖర్, కిరణ్, గోపి విజయ్, శుభానీ,వీరబాబు, రాజేష్, ప్రసాద్, సత్యం, శుభానీ, శ్రీను, లోకేష్,పవన్, వెంకటేశ్వరావు, రమేష్, ఇతర ముఖ్య నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# పెద్దతుంబలం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలి

**- వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు హనుమంతురెడ్డి, వైస్సార్సీపీ నాయకులు శివరాజు**

**అదోని నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** అదోని. మండలపరిధిలో. పెద్ద తుంబలం. గ్రామ సచివాలయం నందు. సచివాలయ సిబ్బందికి. వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూఆయా గ్రామాల ప్రజలు పెద్ద తుంబలం. గ్రామ. ప్రజలు వారు. మాట్లాడుతూ. పెద్ద తుంబలం. గ్రామాన్ని. మండల కేంద్రంగా చేయాలని చెప్పి. గ్రామ ప్రజలు మరియు వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి. వికలాంగుల సంఘం అధ్యక్షులు. హనుమంత్ రెడ్డి. కేశవలు. శివరాజు. తదితరులు పాల్గొన్నారు.

# ల్యాండ్ సర్వే పనులను పరిశీలించిన తహసిల్దార్



**సిరివెళ్ల నవంబర్ 27 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామ మజీరా పూలతోట కొట్టాల గ్రామ సమీపంలో గురువారం జరుగుతున్నటు వంటి ల్యాండ్ సర్వే పనులను తహసిల్దార్ విజయశ్రీ పరిశీలించారు. 203/బి సర్వేనెం బర్ రస్తా వివాదంపై నంద్యాల జిల్లా ప్రజా సమస్యలపరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేయగా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు గురువారం వివాదా స్పద రస్తాను సర్వే కొలతలు వేశారు. మండల సర్వేయర్ చిన్న మల్లయ్య గ్రామ సర్వే యర్లు, విఆర్ఓలు, వీఆర్ ఏలు, అర్జీదారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూలతోట కొట్టాలలో జరుగుతున్నటువంటి సర్వే పనులు ఆలస్యం కావడం వల్ల మరో గ్రామంలో జరుగుతున్న సర్వే పనులకు హాజరు కాలేక పోయినట్లు సమాచారం.

# ప్రమాదవశాత్తు బాస్కెట్‌బాల్ ప్లేయర్ మృతి



హరియాణాలో విషాదం జరిగింది. ఆ రాష్ట్రానికి చెందిన హార్దిక్ (16) అనే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ప్రాక్టీస్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ బాస్కెట్‌బాల్ హూప్ పోల్ మీద పడడంతో కోర్టులోనే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. 16 ఏళ్ల బాస్కెట్‌బాల్ ఆటగాడు హార్దిక్ లఖన్ మజ్రా గ్రామంలోని స్పోర్ట్స్ గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ కోర్టులో ప్రాక్టీస్ చేసేందుకు వెళ్లాడు. ప్రాక్టీస్ సమయంలో బాస్కెట్‌బాల్ హూప్‌ను పట్టుకొని వేలాడుతుండగా, అకస్మాత్తుగా పోల్ విరిగి అతడి ఛాతిపై పడింది. దీంతో హార్దిక్ అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆ సమయంలో అక్కడే కోర్టులో ఉన్న ఇతర ప్లేయర్లు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే హార్దిక్ మృతి చెందినట్లు తెలుస్తోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. స్కెట్‌బాల్‌లో అద్భుతమైన ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న హార్దిక్ భారత జట్టుకు ఎంపికయ్యాడు. అతను ఇటీవల భారత జట్టు శిబిరం నుంచి తిరిగి వచ్చి, రానున్న పోటీలకు సన్నద్ధమవుతున్నాడు. కానీ ఇంతలోనే ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కుమారుడు బాస్కెట్‌బాల్‌లో అద్భుతంగా రాణించి పేరు సంపాదిస్తాడనుకుంటే, విధి ఇలా చేసిందంటూ అతడి తల్లిదండ్రులు విలపించారు. కాగా, హార్దిక్‌కు ఒక తమ్ముడు ఉన్నాడు. అతను కూడా మంచి బాస్కెట్‌బాల్ ఆటగాడే కావడం విశేషం. కాగా, రెండు రోజుల కిందట అదే రాష్ట్రం జజ్జర్ జిల్లాలోని బహదూర్‌గఢ్‌లోని హెూషియార్ సింగ్ స్పోర్ట్స్ స్టేడియంలో ఇలాంటి ఘటనే జరిగింది. 15ఏళ్ల అమన్ అనే బాస్కెట్‌బాల్ ఆటగాడు కూడా ఇదే తరహాలో ప్రాణాలు కోల్పోయాడు. కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో అమన్‌పై బాస్కెట్‌బాల్ స్తంభం మీద పడడంతో మృతి చెందాడు. దీంతో హరియాణాలో క్రీడా మౌలిక సదుపాయాల పరిస్థితులపై అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ పనులు సకాలంలో జరిగితే ఇలాంటి ప్రమాదాలు జరిగేది కావని అభిప్రాయపడుతున్నారు.

# నా భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవాల్సింది బీసీసీఐనే



● భారత కోచ్ గంభీర్ సంచలన కామెంట్స్

గువాహటి టెస్టులో సౌతాఫ్రికాపై భారత్ ఘోర ఓటమి చవిచూసింది. 408 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. పరుగుల పరంగా టెస్టు క్రికెట్ చరిత్రలో టీమ్‌ఇండియాకు ఇదే అతి పెద్ద ఓటమి. దీంతో సౌతాఫ్రికాతో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ క్లీన్‌స్వీప్ అయ్యింది. అయితే ఈ సిరీస్ ఫలితంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అతడి కోచింగ్ పీరియడ్‌లోనే గతేడాది స్వదేశంలో న్యూజిలాండ్‌పైనా 3-0తో భారత్ క్లీన్‌స్వీప్ అయ్యింది. ఒక కోచ్ పీరియడ్‌లో స్వదేశంలో భారత్ రెండుసార్లు క్లీన్‌స్వీప్ అవ్వడం ఇదే తొలిసారి. దీంతో గంభీర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. అతడు తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలే వల్లే జట్టుకు ఈ పరిస్థితి అంటూ నెటిజన్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో సౌతాఫ్రికాతో రెండో టెస్టు మ్యాచ్ అనంతరం స్వయంగా గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. ఇందులో కోచ్‌గా తన భవిష్యత్ ఏంటని మీడియా ప్రశ్నించగా, గంభీర్ సంచలన కామెంట్స్ చేశాడు. నా భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవాల్సింది బీసీసీఐనే. అంతిమంగా భారత్‌లో క్రికెటే ముఖ్యం. నేను కాదు. ఈ విషయాన్ని నేను కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న రోజే చెప్పాను. ఈరోజు కూడా అదే చెబుతున్నా. అయితే ఇంగ్లాండ్ సిరీస్‌లో అద్భుతమైన ఫలితాలు రాబట్టింది కూడా మేమే అనే విషయాన్ని జనాలు అని మర్చిపోతున్నారు. కానీ అందరూ న్యూజిలాండ్ సిరీస్ గురించే మాట్లాడుతున్నారు'అలా అయితే ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ ట్రోఫీలు కూడా గెలిచింది నా కోచింగ్ పీరియడ్‌లోనే. ఇప్పుడున్న జట్టులో కుర్రాళ్లే ఎక్కువ. వాళ్లకు ఉన్న అనుభవం తక్కువ. కుదురుకోవడానికి వాళ్లకు కాస్త సమయం పడుతుందని నేను ఇదివరకే చెప్పాను. కుర్రాళ్లకు ఇంకా టైమ్ ఇవ్వాలి. అయినా ఓటమిపై అందర్నీ నిందించాలి. ఓటమికి అందరిదీ బాధ్యతే' అని గంభీర్ అన్నాడు. తాజా ఓటమితో భారత్ స్వదేశంలో ఆడిన గత 7 మ్యాచ్‌ల్లో ఐదింట ఓటమిపాలైంది. ఇక గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత 19 టెస్టుల్లో 10 మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియా ఓడింది. గతేడాది స్వదేశంలో భారత్, న్యూజిలాండ్‌ను ఢీ కొట్టింది. ఆ సిరీస్‌ను కూడా 3-0తో కోల్పోయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటలోనూ భారత్ విఫలమైంది. ఆసీస్‌తో ఆడిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీని టీమ్‌ఇండియా 1- 3 కోల్పోయింది. అయితే ఈ ఏడాది యంగ్ ప్లేయర్లతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియా మంచి ఫలితం రాబట్టింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకుంది. స్వదేశంలో సౌతాఫ్రికాపై వైట్‌వాష్‌కు గురికావడం భారత్‌కు 25ఏళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా సౌతాఫ్రికా 2000 సంవత్సరంలో భారత్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. అంతేకాకుండా ఈ సిరీస్‌లో రెండు టెస్టుల్లోనూ భారత్ నుంచి ఏ ఒక్క బ్యాటర్ కూడా మూడంకెల స్కోర్ అందుకోలేదు. గత 30ఏళ్లలో స్వదేశంలో టెస్టు సిరీస్‌లో టీమ్‌ఇండియా ప్లేయర్లు సెంచరీ చేయకపోవడం ఇదే తొలిసారి.

# అత్యంత ఖరీదైన క్రీడాకారిణిగా దీప్తి శర్మ



మహిళల ప్రీమియర్ లీగ్ 2026 వేలం మార్కీ ప్లేయర్స్‌తో ప్రారంభమైంది, ఈ కేటగిరీలో మొత్తం 8 మంది క్రీడాకారులు ఉన్నారు. 7 మార్కీ క్రీడాకారులకు వారి జట్లు లభించాయి, అయితే ఈ రౌండ్‌లో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అలీసా హీలీని ఎవరూ కొనలేదు. ఈ రౌండ్‌లో అత్యంత ఖరీదైన క్రీడాకారిణి ఆల్ రౌండర్ దీప్తి శర్మ, యూపీ వారియర్స్ ఆమె కోసం ఆటీఎం ని ఉపయోగించింది. దీప్తి శర్మ తిరిగి యూపీ వారియర్స్‌కు వెళ్లడంపై సంతోషం వ్యక్తం చేస్తూ జియోహాట్‌స్టార్‌లో మాట్లాడుతూ, "చాలా బాగుంది. నేను యూపీకి చెందినదాన్ని, కాబట్టి ఏదో ఒక విధంగా ఈ జట్టుతో నాకు అనుబంధం ఉంది. ఇక్కడి నిర్వహణ చాలా బాగుంది. మహిళల ప్రీమియర్ లీగ్ నా ప్రదర్శనను మెరుగుపరచడానికి చాలా సహాయపడింది." దీప్తి శర్మ మహిళల ప్రీమియర్ లీగ్ 2026 వేలం జాబితాలో మూడో స్థానంలో ఉంది, ఆమెకు ముందు అలీసా హీలీని ఎవరూ కొనలేదు. హీలీని కొనకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. చాలాసేపు దీప్తిపై కూడా ఏ జట్టు బిడ్ వేయలేదు, చివరకు ఢిల్లీ ఆమెపై ఆమె బేస్ ప్రైస్‌తో బిడ్ వేసింది. ఆ తర్వాత ఏ జట్టు ఆసక్తి చూపించకపోవడంతో ఆమె ఢిల్లీకి అమ్ముడుపోయింది. కానీ యూపీ ఆమెపై ఉపయోగించింది, ఆ తర్వాత ఢిల్లీ తన తుది ధర 3 కోట్ల 20 లక్షల రూపాయలుగా పేర్కొంది. యూపీ ఉపయోగిస్తూ దీప్తిని కొనుగోలు చేసింది. మార్కీ రౌండ్‌లో యూపీ వారియర్స్ ముగ్గురు ఆటగాళ్లను కొనుగోలు చేసింది. దీప్తి శర్మ (3.2 కోట్లు)తోపాటు ఈ రౌండ్‌లో సోఫీ ఎక్లెస్టన్ (85 లక్షలు), మెగ్ లానింగ్ (1.9 కోట్లు)ను కూడా కొనుగోలు చేసింది. ఈ రౌండ్‌లో గుజరాత్ జెయింట్స్ ఇద్దరు ఆటగాళ్లను (సోఫీ డివైన్, రేణుకా సింగ్) తమ జట్టులో భాగం చేసుకుంది. ఆశా శోభనను యుపి వారియర్స్ సొంతం చేసుకుంది. ఇతర జట్లు కూడా శోభనపై ఆసక్తిని వ్యక్తం చేయడంతో ఆమె ధర 30 లక్షల రూపాయల నుంచి 1 కోటి రూపాయలకు పెరిగింది. ఆశా బేస్ ధర 30 లక్షల రూపాయలు ఈ వేలంలో ఆమె మునుపటి ఎడిషన్ కంటే 11 రెట్లు ఎక్కువ డబ్బు అందుకుంది. ఆశా శోభన మార్చి 16, 1991న కేరళలోని త్రివేంద్రంలో జన్మించిన ఆల్ రౌండర్. 34 ఏళ్ల ఆమె ఇప్పటివరకు భారతదేశం తరపున రెండు వన్డేలు, ఆరు టి20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. ఆమె ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2022/23, 2023/24 ఎడిషన్‌లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడింది. ఆశా శోభన ఇప్పటివరకు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఆర్‌సిబి తరపున 15 మ్యాచ్‌లు ఆడి 17 వికెట్లు పడగొట్టింది. ఆమె బ్యాటింగ్‌తో అంతగా ఆకట్టుకోలేకపోయినప్పటికీ, ఆమెకు ఆ సామర్థ్యం ఉంది. 2026 ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ వేలంలో ఆశా శోభన దుమ్మురేపింది. గత సంవత్సరం కంటే 11 రెట్లు ఎక్కువ సంపాదించింది. రాబోయే ఎడిషన్ కోసం, ఆమె బేస్ ధర 30 లక్షలుగా నిర్ణయించింది. ఆమె ధర 1 కోటికి చేరుకుంది.

# సారీ ఫ్యాన్స్.. క్షమించండి

● టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్




భారత క్రికెట్ అభిమానులకు టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ క్షమాపణలు చెప్పాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయామని, తమను మన్నించాలని కోరాడు. గౌహతి వేదికగా బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా 408 పరుగుల భారీ తేడాతో టీమిండియాను చిత్తు చేసిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో సౌతాఫ్రికా క్లీన్ స్వీప్ చేసింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్ట్ సిరీస్ గెలుపొందింది. వరుసగా రెండో ఏడాది టెస్ట్ సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయ్యింది. దాంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు ఆటగాళ్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ సిరీస్‌కు రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో దూరమవడంతో వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్ జట్టును నడిపించాడు. కానీ 93 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే ఏన్నడు లేని పరాజయాన్ని టీమిండియా చవిచూసింది. ఈ క్రమంలోనే అభిమానులకు క్షమాపణలు చెబుతూ రిషభ్ పంత్ సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పంచుకున్నాడు. 'గత రెండు వారాలుగా మేం సరిగ్గా ఆడలేదనేది నగ్న సత్యం. జట్టుగా.. వ్యక్తిగతంగా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలని, కోట్లాది మంది భారతీయుల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావాలని కోరుకుంటాం. కానీ ఈ సారి మేం మీ అంచనాలను అందుకోలేకపోయాం. అందుకు మమ్మల్ని క్షమించండి. కానీ క్రీడల్లో ఓటమి ఎప్పుడూ జట్టుగా.. వ్యక్తిగతంగా గుణపాఠం నేర్పుతుంది. మరింత మెరుగవ్వాలని విషయాన్ని సూచిస్తుంది. భారత్ దేశానికి ప్రాతినిథ్యం వహించడం మా జీవితాల్లోనే మాకు దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ జట్టు సామర్థ్యం ఏంటో మాకు తెలుసు. మేం మరింత కష్టపడుతాం. మా ఆటపై మరింత ఫోకస్ పెడ్తాం. వ్యక్తిగతంగా జట్టుగా నేలకు కొట్టిన బంతిలా తిరిగి వస్తాం. మీ అమితమైన మద్దతు, ప్రేమకు ధన్యవాదాలు. జైహింద్'అని పంత్ తన సుదీర్ఘ పోస్ట్‌లో పేర్కొన్నాడు. టెస్ట్ సిరీస్ కోల్పోయిన టీమిండియా.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్ధమవుతోంది. నవంబర్ 30న రాంచీ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌తో కోహ్లీ, రోహిత్ రీఎంట్రీ ఇవ్వనుండగా.. బుమ్రా, సిరాజ్, శుభ్‌మన్ గిల్‌కు రెస్ట్ ఇచ్చారు. కేఎల్ రాహుల్ భారత జట్టును నడిపించనున్నాడు.

# శ్రీచరణికి కోటి 30 లక్షలు



వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) మెగా వేలంలో టీమిండియా స్టార్ స్పిన్నర్, తెలుగు తేజం శ్రీ చరణికి రూ. 1.30 కోట్ల జాక్‌పాట్ ధర దక్కింది. దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా గురువారం జరిగిన మెగా వేలంలో ఈ కడప బిడ్డను ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన శ్రీచరణి కోసం యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.30 కోట్ల రికార్డ్ ధరకు సొంతం చేసుకుంది. గత సీజన్‌లోనూ శ్రీ చరణి ఢిల్లీ క్యాపిటల్స్‌కే ఆడింది. రూ. 50 లక్షల భారీ ధరకు ఈ తెలుగు తేజాన్ని ఢిల్లీ కొనుగోలు చేసింది. డబ్ల్యూపీఎల్ 2025 సీజన్‌లో రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడిన శ్రీ చరణి.. 4 వికెట్లతో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చింది. ఈ అద్భుత ప్రదర్శనతోనే టీమిండియాకు ఆడే అవకాశం అందుకున్న శ్రీచరణి ఏకంగా.. మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీకి ఎంపికైంది. మెగా టోర్నీలో 21 ఏళ్ల శ్రీ చరణి అదరగొట్టింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ అయిన ఈ ఆంధ్రా అమ్మాయి 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. ఈ 9 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ మినహా.. ప్రతీ మ్యాచ్‌లో వికెట్ తీసింది. ముఖ్యంగా సెమీస్, ఫైనల్లో ఆమె కట్టుదిట్టమైన బౌలింగ్ టీమిండియా విజయానికి బాటలు వేసింది. ఈ టోర్నీలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచింది. ఈ ప్రదర్శనే వేలంలో శ్రీ చరణి కోట్లు పలికేలా చేసింది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఇదే తొలి మెగా ఆక్షన్ కాగా.. మల్లికా సాగర్ ఆక్షనీర్‌గా వ్యవహరిస్తోంది. ఆస్ట్రేలియా క్రికెటర్ అలీసా హీలీతో మెగా వేలం ప్రారంభం కాగా.. ఆమెను తీసుకోవడానికి ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించలేదు. దాంతో ఆమె తొలి రౌండ్‌లో అన్‌సోల్డ్‌గా నిలిచింది. మరోసారి ఆమె పేరును వేలం వేసే అవకాశం ఉంది. న్యూజిలాండ్ ప్లేయర్ సోఫీ డివైన్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.2 కోట్లకు కొనుగోలు చేయగా.. కివీస్‌కే చెందిన అమెలియా కేర్‌ను ముంబై ఇండియన్స్ రూ.3 కోట్లకు తీసుకుంది. భారత పేసర్ రేణుకా సింగ్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.60 లక్షలకు కొనుగోలు చేసింది. ఇంగ్లండ్ ప్లేయర్ సోఫీ ఎక్లిస్టోన్‌ను రూ.85 లక్షలకు యూపీ వారియర్స్ ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా రిటైన్ చేసుకుంది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్ట్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 1.10 కోట్లకు కొనుగోలు చేసింది.

# పని గంటల వివాదంపై కీర్తి సురేశ్ తెలివైన సమాధానం



సినీ పరిశ్రమలో కొన్ని నెలలుగా చర్చనీయాంశమైన '8 గంటల పని' వివాదంపై ప్రముఖ నటి కీర్తి సురేశ్ స్పందించారు. తన కొత్త చిత్రం 'రివాల్వర్ రీటా' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ నటి దీపిక పదుకొణె ప్రారంభించిన ఈ చర్చపై కీర్తి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.పనివేళల గురించి మాట్లాడుతూ.. "నేను 9 నుంచి 6 గంటలైనా, 9 నుంచి 9 గంటలైనా పనిచేయగలను. అదొక సమస్య కాదు. కానీ ఉదయం 9 గంటలకు సెట్‌లో ఉండాలంటే, నటీనటులు తెల్లవారుజామున 5 గంటలకే లేవాలి. మేకప్ పూర్తి చేసుకుని 7:30 కల్లా లొకేషన్‌కు చేరుకోవాలి" అని వివరించారు. షూటింగ్ పూర్తయ్యాక ఇంటికి చేరేసరికి చాలా ఆలస్యమవుతుందని, దీంతో విశ్రాంతికి సమయం సరిపోదని అన్నారు. "మనిషికి నిద్ర చాలా ముఖ్యం. కానీ మాకు 8 గంటల నిద్ర ఎక్కడుంది?" అని ఆమె ప్రశ్నించారు.అయితే, అవసరమైతే తాను ఎన్ని గంటల పాటైనా నటిస్తానని చెబుతూనే, నటీనటుల కంటే టెక్నీషియన్ల పరిస్థితి మరింత కష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. "మా కంటే వాళ్లు ఎక్కువ సమయం సెట్‌లో ఉంటారు, వారికి కేవలం రెండు, మూడు గంటల నిద్రే దొరుకుతుంది" అని అన్నారు. తెలుగు, తమిళ పరిశ్రమల్లో 8 గంటల పని విధానం ఉందని, కానీ మలయాళం, హిందీ పరిశ్రమల్లో 12 గంటల కాల్షీట్ ఉంటుందని పేర్కొన్నారు.

మొత్తంమీద, కీర్తి సురేశ్ ఒకవైపు దీపిక వాదనలోని నిద్ర ప్రాముఖ్యతను సమర్థిస్తూనే, మరోవైపు నిర్మాతలకు ఇబ్బంది కలగకుండా తాను ఎక్కువ గంటలు పనిచేయడానికి సిద్ధమని చెప్పి తెలివిగా వ్యవహరించారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# 'ఇఫీ' ఫిల్మ్ ఫెస్టివల్ లో సందడి చేసిన 'కమిటీ కుర్రోళ్లు'




చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై మెరిసింది. గోవాలో జరుగుతున్న 56వ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) 2025లో ఈ సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు విశేష స్పందన లభించింది.ఈ ఏడాది ఆగస్టు 9న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం, తక్కువ బడ్జెట్‌తో రూపొంది అనూహ్య విజయాన్ని అందుకుంది. కొత్త నటీనటులు సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు ప్రధాన పాత్రలలో నటించారు. నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించగా, యదు వంశీ దర్శకత్వం వహించారు. అనుదీప్ దేవ్ అందించిన సంగీతం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించింది.

తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ఈ చిత్రం ఇప్పుడు 'ఇఫీ' వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై ప్రదర్శితం కావడం పట్ల చిత్ర యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది.




# పవన్ కల్యాణ్‌తో లోకేశ్ కనగరాజ్ ?

## .. టాలీవుడ్‌లో హాట్ టాపిక్!


దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్క్ సృష్టించుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు తెలుగులో ఓ స్ట్రెయిట్ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో ఆయన ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారనే వార్త ఫిల్మ్‌నగర్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కన్నడలో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించనున్నట్లు సమాచారం.'ఖైదీ', 'విక్రమ్' వంటి చిత్రాలతో గ్యాంగ్‌స్టర్ డ్రామాలను కొత్తగా ఆవిష్కరించిన లోకేశ్, ప్రస్తుతం రజనీకాంత్‌తో 'కూలీ' సినిమా చేస్తున్నారు. దీని తర్వాత రజనీకాంత్-కమల్‌హాసన్ కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్ చేస్తారని వార్తలు వచ్చాయి. అయితే, తాజా సమాచారం ప్రకారం లోకేశ్ ఆ ప్రాజెక్ట్‌ను పక్కనపెట్టి, పవన్ కల్యాణ్‌తో సినిమా చేసేందుకే ఆసక్తి చూపుతున్నారని అంటున్నారు. ఈ సినిమాలో నటించేందుకు పవన్ కూడా సుముఖంగా ఉన్నారని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది.ప్రస్తుతం పవన్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా తర్వాత ఆయన మరో ప్రాజెక్ట్‌కు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో ఆయన తదుపరి చిత్రం లోకేశ్ దర్శకత్వంలోనే ఉంటుందన్న ఊహాగానాలకు బలం చేకూరుతోంది. అయితే, ఈ వార్తలపై స్పష్టత రావాలంటే నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ' ఛాంపియన్ ' భారీ అంచనాలు




హీరో శ్రీకాంత్ కుమారుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఛాంపియన్' నుంచి ఫస్ట్ సింగిల్ 'గిరా గిరా' విడుదలైంది. మిక్కీ జే మేయర్ స్వరాలు, రామ్ మిరియాల గానం, కాసర్ల శ్యామ్ సాహిత్యం ఈ గ్రామీణ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో రోషన్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా కనిపిస్తుండగా, హీరోయిన్ అనస్వర రాజన్ 'తాళ్లపూడి చంద్రకళ'గా పరిచయమవుతోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సీనియర్ నటుడు శ్రీకాంత్ తనయుడిగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి హీరోగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు మేక రోషన్ . 'పెళ్లిసందడి'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న అతడు నటనలో మెరుగులు దిద్దుకుంటూ క్రమంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో కీలక అడుగుగా భావిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ' ఛాంపియన్ ' భారీ అంచనాల నడుమ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రోషన్ నటించడం ఆసక్తిగా మారింది. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'ఛాంపియన్' చిత్రాన్ని స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని రేపింది. పీరియాడిక్ వాతావరణం, గ్రామీణ నేపథ్యం, స్పోర్ట్స్ ఎమోషన్స్ అన్నీ కలిసి ఈ సినిమా యూత్ మరియు ఫ్యామిలీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేలా కనిపిస్తోంది. తాజాగా మూవీ టీమ్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. 'గిర గిర గిరగింగిరా గిరే' అనే ఈ గ్రామీణ మట్టివాసనతో నిండిన పాట మట్టిలో పెరిగిన మనుషుల నైజం, వారి రోజువారీ జీవితాలను సహజంగా చూపిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ ఈ సాంగ్‌కు స్వరాలు సమకూర్చగా, రామ్ మిరియాల తనదైన భిన్నమైన ఫోక్ స్టైల్‌తో పాటకు ప్రాణం పోశాడు. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం గ్రామీణ వాతావరణాన్ని అచ్చుగుద్దినట్టు ప్రతిబింబించింది.

# విజయ్ దేవరకొండ సినిమాపై ఆసక్తి



విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబోలో వస్తున్న 'వీడీ 14' సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో, 19వ శతాబ్దపు యదార్థ సంఘటనల ఆధారంగా ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాని తెరకెక్కిస్తున్నారు. ఇందులో రష్మిక మందన హీరోయిన్ గా నటిస్తున్నట్లు సమాచారం. హాలీవుడ్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ధృవీకరించే ఓ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి 'వీడీ 14' అనే వర్కింగ్ టైటిల్ తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో తీస్తున్నారు. ఇందులో స్టార్ కాస్టింగ్, టెక్నీషియన్స్ భాగం అవుతున్నారు. రెండున్నరేళ్లపాటు ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ మీద వర్క్ చేసిన రాహుల్.. సైలెంట్ గా షూటింగ్ కానిచ్చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ కీలక సమాచారం బయటకు వచ్చింది. 'వీడీ 14' అనేది బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో రూపొందే పీరియాడిక్ యాక్షన్ డ్రామా అని తెలుస్తోంది. 19వ శతాబ్దంలో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ క్యారెక్టరైజేషన్, ఆయన గెటప్ చాలా కొత్తగా ఉంటాయని టాక్. ఇక ఈ సినిమాలో 'మమ్మీ' విలన్ ఆర్నాల్డ్ వోస్లూ నటిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. కనే మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఇప్పుడు ఈ విషయాన్ని ధృవీకరించే ఓ ఫోటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

విజయ్ దేవరకొండ సినిమాలో సౌత్ ఆఫ్రికన్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఆయన ఇప్పటికే 'వీడీ 14' షూటింగ్ లో జాయిన్ అయినట్లు తెలుస్తోంది. సెట్స్ లో తమిళ యాక్టర్ వినోద్ సాగర్, ఆర్నాల్డ్ కలిసి దిగిన ఓ ఫోటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దీంతో హాలీవుడ్ స్టార్ ఈ సినిమాలో నటిస్తున్నారనే విషయం కన్ఫామ్ అయింది. ఆయన ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారో అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగిపోయింది.

# ఎట్టకేలకు హిట్ కొట్టిన రామ్ పోతినేని



రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆంధ్రకింగ్ తాలూకా.. ఈ సినిమా భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న డైరెక్టర్ పి. మహేశ్ బాబు ఈ సినిమాను తెరకెక్కించాడు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటించాడు. అలాగే రావు రమేష్, మురళీ శర్మ, రాజీవ్ కనకాలు, తులసి, సింధు తులానీ, రాహుల్ రామకృష్ణ, సత్య, వీటీవీ గణేష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మించారు. ఇక ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రావడంతో ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకులు సినిమా పై తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఇక సినిమా బాగుందని.. చాలా కాలం తర్వాత రామ్ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు అంటున్నారు. రామ్ నటన సినిమాకే హైలైట్ అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అలాగే ఎట్టకేలకు రామ్ హిట్ కొట్టాడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు కొందరు ప్రేక్షకులు. మొత్తానికి ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్ లోకి వచ్చాడు రామ్ పోతినేని.